


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 09 జూలై 2021 | సంపుటి : 02 | సంచిక :347 | పేజీలు : 4 | వెల : రూ 3-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


# రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : జగన్



అనంతపురం, జూలై 8, (న్యూస్ పల్స్)రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలో ఏర్పాటు చేసిన రైతు సభలో సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, జలయజ్ఞంతో రాష్ట్ర రూపురేఖలను మార్చిన ఘనత వైఎస్‌ఆర్‌ది అని సీఎం జగన్ గుర్తుచేశారు. మనది రైతుపక్షపాత ప్రభుత్వమని, రెండేళ్లలో రైతుల కోసం రూ.8,670 కోట్లు ఖర్చు చేశామని సీఎం జగన్ పేర్కొన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలబడ్డామని సీఎం జగన్ తెలిపారు. పెట్టుబడిసాయం కింద రైతన్నలకు ఏటా రూ.13,500 ఇస్తున్నామని, రెండేళ్లలో రైతు భరోసా కింద రూ.17,029 కోట్లు ఇచ్చామని సీఎం జగన్ తెలిపారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామని, ప్రతి పంటకు ఈ-క్రాపింగ్ చేయిస్తున్నామని ఆయన చెప్పారు. ఏ పంట వేశారు? ఎన్ని ఎకరాల్లో వేశారనే వివరాలు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ జరుగుతుందని సీఎం పేర్కొన్నారు. పంటకు గిట్టుబాటు ధర రాకపోతే ఆర్‌బీకేలో అమ్ముకోవచ్చని, రైతులకు అడుగడుగునా ఆర్‌బీకేలు అండగా ఉంటాయని సీఎం జగన్ తెలిపారు. పంట నష్టపోతే క్రాప్ ఇన్సూరెన్స్ కూడా అందజేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ఏ సీజన్‌లోని ఇన్‌పుట్ సబ్సిడీని ఆ సీజన్‌లోనే ఇస్తున్నామని, ఆర్‌బీకేల ద్వారా తక్కువ అద్దెకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. గ్రామ సచివాలయాల ద్వారా అన్ని సేవలు అందిస్తున్నామని ఆయన తెలిపారు.కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ కలిస్తేనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని, ఏ ప్రాంతానికి నీటి వాటా ఎంతో అందరికీ తెలుసని సీఎం జగన్ అన్నారుదీనికంటే ముందు రాయదుర్గం మార్కెట్ యార్డ్‌లో అగ్రి ల్యాబ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థి పాఠశాలలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ఉడేగోళం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సీఎం ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రంలో స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం మొక్కను నాటారు. రైతు భరోసా కేంద్రం ప్రారంభించిన అనంతరం సీఎం జగన్.. కాసేపు రైతులతో ముచ్చటించారు.

# ఇడుపులపాయలో వైఎస్‌కు కుటుంబ సభ్యుల నివాళి

**తల్లితో కలసి వేరుగా వచ్చిన షర్మిల**
**జిల్లాలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు**
**వైఎస్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన మంత్రి బాషా**



కడప,జూలై8(): ఇడుపులపాయలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ భారతి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అలాగే వైఎస్ఆర్ ఘాట్ వద్ద వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిల నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. షర్మిలతో పాటు కొడుకు, కూతురు కూడా పాల్గొన్నారు. అయితే వీరంతా వేర్వేరుగా వచ్చి నివాళులు అర్పించారు. ఏటా కలసి వచ్చి ప్రార్ధనల్లో పాల్గొనే వారు. ఈ సారి సిఎం జగన్ రాలేదు. షర్మిల కూడా కేవలం తల్లితో కలసి వచ్చారు. ఇకపోతే వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం అంజాద్ బాష కడపలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ అమ్మాజీ, మేయర్ సురేష్ బాబు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, ఏపీ ఏనార్టీ డైరెక్టర్ ఇలియస్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో క్రిష్టారెడ్డి కమలాపురం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రాజుపాలెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఉత్తమారెడ్డి పాల్గొన్నారు. రాజంపేట మండలంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రైతు దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి రాజంపేట ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేశారు. అంతకముందు ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, అకేపాటి అమరనాథ్ రెడ్డి రాజంపేట పాత బస్టాండు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

# నీటిని రాజకీయాలకు వాడుకోవద్దు: సీఎం జగన్



రాయదుర్గం: నీటి విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలో ఏర్పాటు చేసిన రైతు సభలో సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంతోనూ విబేధాలు పెట్టుకునే ఉద్దేశం మాకు లేదని, అన్ని రా(ష్టాలతో సఖ్యతగా ఉండాలనే కోరుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాజకీయాల్లో వేలుపెట్టలేదని ఈ సందర్భంగా సీఎం జగన్ గుర్తుచేశారు. తెలంగాణలో కొంతమంది మంత్రులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన అన్నారు.కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ కలిస్తేనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని.. ఏ ప్రాంతానికి నీటి వాటా ఎంతో అందరికీ తెలుసని సీఎం జగన్ అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ, కేంద్రం కలిసి 2015 జూన్‌లో నీటి కేటాయింపులు జరిపియని సీఎం తెలిపారు. 881 అడుగుల నీటిమట్టం ఉంటేనే కానీ పోతిరెడ్డిపాడుకు నీళ్లు రావని, గత 20 ఏళ్లలో శ్రీశైలంలో 881 అడుగులకుపైగా నీళ్లు 20 నుంచి 25 రోజులకు మించి లేవని ఆయన చెప్పారు. తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి ప్రాజెక్ట్‌లకు 800 అడుగులలోపే నీళ్లు తీసుకుంటున్నారని సీఎం జగన్ అన్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని, 800 అడుగుల్లోపు తెలంగాణ వాడుకున్నప్పుడు ఏపీ వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు.అయ్యా చంద్రబాబు ఆనాడు ఏం చేశావ్?అయ్యా చంద్రబాబు ఇవాళ మాటలు మాట్లాడుతున్నావు. అయ్యా? గతంలో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నారు. అప్పుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆనాడు తెలంగాణలో ప్రాజెక్ట్‌లు కడుతుంటే చంద్రబాబు గాడిదలు కాశారా వ అని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి, దిండి.. ఈ ఎత్తిపోతల ప్రాజెక్టులన్నీకూడా కడుతూ ఉంటే మీరు గాడిదలు కాస్తున్నారా? అని చంద్రబాబుని సీఎం జగన్ నిలదీశారు. రైతులు ఏ ప్రాంతంలో ఉన్నా రైతులేనని, రైతుల కోసం అందరూ కలిసి రావాలని సీఎం అన్నారు. నీటిని రాజకీయాలకు వాడుకోవద్దని సీఎం జగన్ సూచించారు.

# పులివెందుల రోడ్డును ఫోర్‌లైన్ రోడ్డుగా మారుస్తున్నాం: సీఎం జగన్



పులివెందుల: పులివెందులను రూ.630 కోట్లతో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులలోని మోడల్ టౌన్, వాటర్ గ్రిడ్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్రికెట్ స్టేడియం పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ..పులివెందులను రూ.630 కోట్లతో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతున్నామని, రోడ్లు, తాగునీరు, డ్రైనేజ్ కోసం రూ.154 కోట్లు కేటాయించామని సీఎం జగన్ తెలిపారు. పులివెందుల రోడ్డును ఫోర్‌లైన్ రోడ్డుగా మారుస్తున్నామని, రూ.30 కోట్లతో స్కిల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం సీఎం తెలిపారు. రూ.500 కోట్లతో మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ చేరుకొని మహానేత వైఎస్ఆర్‌కు సీఎం జగన్ నివాళులర్పించనున్నారు.

# ట్విట్టర్‌కు వార్నింగ్ ఇచ్చిన కొత్త ఐటీశాఖ మంత్రి



న్యూఢిల్లీ : కేంద్ర ఐటీశాఖ మంత్రిగా ఇవాళే బాధ్యతలు చేపట్టిన అశ్విని వైష్ణవ్.. వచ్చీ రాగానే సోషల్ మీడియా సంస్థ ట్విట్టర్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఈ నేలపై రూపుదిద్దుకున్న చట్టాలే అత్యున్నతమని, కచ్చితంగా కొత్త ఐటీ రూల్స్‌ను ట్విట్టర్ పాటించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఇటీవల ట్విట్టర్ సంస్థకు, కేంద్ర ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. మాజీ ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కూడా పలు మార్లు ట్విట్టర్‌కు ఇలాంటి వార్నింగ్‌లే ఇచ్చారు. కానీ ట్విట్టర్ మాత్రం తన వైఖరిని మార్చుకోవడం లేదు.ఇవాళ ఢిల్లీ హైకోర్టులోనూ ట్విట్టర్ కేసు విచారణకు వచ్చింది. 8 వారాల్లోగా గ్రీవియన్స్ ఆఫీసర్‌ను నియమించనున్నట్లు ఆ సంస్థ కోర్టుకు చెప్పింది. రూల్స్ పాటించడం లేదని కోర్టు హెచ్చరించిన రెండు రోజుల తర్వాత ట్విట్టర్ ఈ విషయాన్ని వెల్లడించింది. గ్రీవియన్స్ ఆఫీసర్‌ను పెట్టాలని కేంద్రం కోరినా.. ట్విట్టర్ మాత్రం స్పందించడంలేదు. ఈ నేపథ్యంలో కోర్టు ఆ సంస్థకు వార్నింగ్ ఇచ్చింది. కావాల్సినం సమయం ఇవ్వలేమని హైకోర్టు జస్టిస్ రేఖా పాలి తన తీర్పులో అన్నారు

# విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో జగన్ మౌనం వీడాలి

**ప్లాంట్ అమ్మకం చర్యలను వెంటనే అడ్డుకోవాలి**
**టిడిపి నేతలు అచ్చన్నాయుడు,లోకేశ్‌ల డిమాండ్**

అమరావతి,జూలై8 : విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో జగన్ సర్కార్ మౌనం వీడాలని టీడీపీ రాష్ట్ర అధ్య క్షుడు అచ్చెన్నా యుడు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ అమ్మకం పనులు మొదలు కావడంతో కార్మి కులుఆందోళనచేస్తున్నారని అన్నారు. ఈసందర్భంగా గురువా రం ఆయన మీడియాతో మాట్లా డుతూ..ప్రభుత్వమౌనంతో లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడు తున్నారన్నారు. ఫోక్సో కంపెనీకి స్టీల్ ప్లాంటును కట్టబెట్టి కమిషన్లు కొట్టేయాలని గతంలో ప్లాన్ చేశార న్నారు.కేసుల కోసం ఆంధ్రుల హ క్కును కేంద్రానికి తాకట్టు పెట్టారని అచ్చెన్నాయుడు విమర్శించారు. కేసులకోసంకేంద్రంవద్ద మోకరి ల్లడం మానాలని హితవు పలికా రు.



కేంద్రానికి ప్రేమ లేఖలు ఆపి.. ప్రజల కోసం పోరాడాలని అచ్చెన్నాయుడు సూచించారు. ఇదిలావుంటే జగన్‌రెడ్డి ఒక ఫేక్ సీఎంఅనిటీడీపీజాతీయప్రధానకార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామంటూనే.. ప్రైవేటీకరణ పనులు వేగవంతం చేశారన్నారు. ప్రాణ త్యాగాలతో ఏర్పాడిన స్టీల్ ప్లాంట్‌నుప్రైవేట్‌పరం చేయడానికి.. సహకరించిన సీఎంగా, చరిత్రహీ నులుగాజగన్ మిగిలిపోతారని నారా లోకేష్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ఢిల్లీవెళ్లీ ప్రైవేటీకరణఆపేప్రయత్నాలుచేయాలన్నారు. మీ ఎంపీలను, కేసుల మాఫీ లాబీయింగ్ కోసం కాకుండా.. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకుపోరాడాలని ఆదేశాలివ్వాలని నారా లోకేష్ సూచించారు.

# కరోనా కేసుల్లో మళ్లీ పెరుగుదల

**మరణాల సంఖ్యలోనూ కనిపిస్తున్న ఆందోళన**



న్యూఢిల్లీ,జూలై8(: దేశంలో కరోనా కేసులలో గడచిన రెండు నెలలుగా గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. గడచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 45,892 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇదే సమయంలో 44,249 మంది వైరస్ నుంచి కోలుకున్నారు. కరోనా నుంచి కోలుకున్న వారికన్నా కరోనా బారినపడినవారి సంఖ్య 55 రోజుల తరువాత అత్యధికంగా నమోదయ్యింది. గడచిన 24 గంటల్లో కరోనా కారణంగా 817 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం దేశంలో 4.60 లక్షల యాక్టివ్ కేసులు ఉన్నాయి. దేశంలో ఇప్పటివరకూ 4,60,704 మంది కరోనా బారినపడ్డారు. దేశంలోని మొత్తం కేసులతో పోల్చిచూస్తే యాక్టివ్ కేసుల సంఖ్య 1.50 శాతంగా ఉంది. దేశంలో ప్రస్తుతం కరోనా రికవరీ రేటు 97.18 శాతంగా ఉంది. వీక్లీ పాజిటివిటీ రేటు ఐదు శాతానికి దిగువగా నమోదవుతూ వస్తోంది. ప్రస్తుతం పాజిటివిటీ రేటు 2.3 శాతంగా ఉంది. కాగా దేశంలో వ్యాక్సినేషన్ ప(క్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఇదిలావుంటే కర్నాటకరాష్ట్ర వ్యాప్తంగా కొవిడ్ కేసుల గడిచి న 15రోజులుగా తగ్గినా పది జిల్లాల్లో వరుసగా కేసుల సంఖ్య పెరుగుతోంది. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 2,743 మందికి పాజిటివ్ నిర్ధారణ కాగా బెంగళూరులో 611, దక్షిణకన్నడ 304, మైసూరు 248, హాసన్ 220, బెళగావి 120, చిక్కమగళూరు 151, కొడగు 148, శివమొగ్గ 149, తుమకూరు 112, హాసన్ 101 మంది బాధితులయ్యారు. ఆరు జిల్లాల్లో పదిమందిలోపు బాధితులు నమోదు కాగా 14 జిల్లాల్లో వందలోపు బాధితులు ఉన్నారు. 3,081 మంది తాజాగా కోలుకున్నారు. 75 మంది మృతి చెందగా దక్షిణకన్నడలో 14, బెంగళూరులో 12 మంది కాగా మిగిలిన జిల్లాల్లో పదిమందిలోపు బాధితులు ఉన్నారు.

# సాంస్కృతికశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ: కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం శాస్త్ర భవన్ మంత్రిత్వశాఖ కార్యాలయం పూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు చేపట్టారు. కిషన్‌రెడ్డితో పాటు మీనాక్షి లేఖి, అర్జున్ రామ్ మేఘవాల్ సహాయ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే పర్యాటక శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. మరికాసేపట్లో ఈశాన్య రా(ష్టాల అభివృద్ధి శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతులు చేపట్టబోతున్నారు.



# సంపాదకీయం

శుక్రవారం 09 జూలై 2021

## మళ్లీ తెరపైకి గుర్ఖాలాండ్ ఉద్యమం

గూర్ఖాలాండ్?. ఉద్యమం గురించి ఈ తరం వారికి అంతగా తెలియకపోవచ్చు. పాతతరం వారికి బాగా గుర్తుండి ఉంటుంది. తూర్పు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ ను విభజించి ఉత్తర బెంగాల్ ప్రాంతాలతో గూర్ఖాలాండ్ పేరుతో కొత్త రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమమిది. 80వ దశకంలో ఈ ఉద్యమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కుదిపేసింది. తొలి రోజుల్లో ఉద్యమానికి నాయకత్వం వహించిన సుభాష్ ఘీషింగ్ కన్నుమూశారు. బిమల్ గురుంగ్, రోషన్ గిరి వంటి నాయకులు ఇప్పటి గూర్ఖాలాండ్ ఉద్యమానికి ప్రతినిధులుగా ఉన్నారు. ఎనిమిదో దశకం చివర్లో కేంద్రంలోని నాటి రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఈ ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడం ద్వారా పరిస్థితిని ఉపశమింపజేసింది. రాష్ట్రంలోని నాటి సీపీఎం సర్కారును ఇరుకున పెట్టేందుకే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గూర్ఖాలాండ్ ఉద్యమానికి ఊతమిచ్చిందన్న ఆరోపణలు లేకపోలేదు. తాజాగా బెంగాల్ విభజన డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. విభజన కాకుండా ఉత్తర బెంగాల్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలన్న డిమాండ్ ను ఆ ప్రాంతానికి చెందిన బీజేపీ ఎంపీలు మరోసారి లేవనెత్తారు. ఉత్తర బెంగాల్ లోని అలీపుర్దూర్ పార్లమెంటు సభ్యుడు జాన్ బార్లా నివాసంలో జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తారు. అదే ప్రాంతానికి చెందిన జల్పాయ్ గురి పార్లమెంటు సభ్యుడు జయంత్ రాయ్ సైతం సమావేశంలో పాల్గొని తన మద్దతు ప్రకటించారు. ఉత్తర బెంగాల్ లోని అలీపుర్దూర్, జల్పాయ్ గురి, మాల్దా, డార్జిలింగ్, కుచ్ బెహార్, ఉత్తర దీనాజ్ పూర్, దక్షిణ దీనాజ్ పూర్, కాలింపాగ్ జిల్లాలతో కేంద్ర పాలిత ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. పశ్చిమ బెంగాల్ కంటే ఉత్తర బెంగాల్ అన్ని రంగాల్లో వెనకబడిందని,ఇప్పటివరకు పాలించిన ముఖ్యమంత్రులు ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశారని వారు ఆరోపించారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేయడమే ఈ సమస్యకు పరిష్కారం అని వారు చెబుతున్నారు. ఈ డిమాండ్ ను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిని బెంగాలీలను విభజించే కుట్రగా ఆమె అభివర్ణించారు. ఎన్నికల్లో ఓడిపోయిన కమలనాథులు దానిని జీర్ణించుకోలేక పచ్చని రాష్ట్రంలో చిచ్చు పెడుతున్నారని, ఇందుకు కేంద్ర పెద్దల అండదండలు, ప్రోత్సాహం ఉన్నాయని ఆమె ఆరోపించారు. ఉత్తర బెంగాల్ ప్రగతికి తాను ప్రతిన పూనానని, తన కంఠంలో ప్రాణం ఉండగా రాష్ట్ర విభజనను అంగీకరించనని మమతా బెనర్జీ కుండబద్దలు కొట్టారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, మెదినీపూర్ పార్లమెంటు సభ్యుడైన దిలీప్ ఘోష్ సైతం కేంద్ర పాలిత ప్రాంతం డిమాండ్ ను తోసిపుచ్చారు. అయితే తాము రాష్ట్రం నుంచి విడిపోవాలని కోరుకోవడం లేదని, వెనకబడ్డ తమ ప్రాంత అభివద్ధికి కేంద్ర పాలిత ప్రాంతం చేయమని కోరుతున్న విషయాన్ని గమనించాలని బీజేపీ ఎంపీలు చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఈ ప్రాంతంలోని 54 అసెంబ్లీ సీట్లలో 31 సీట్లను కమలం కైవశం చేసుకోగా మమత పార్టీ టీఎంసీ 22 సీట్లకే పరిమితమైంది. కాంగ్రెస్ ఒక సీటును గెలుచుకుందిపేరు ఏదైనప్పటికీ ప్రత్యేక ఉద్యమానికి దశాబ్దాల చరిత్ర ఉంది. 80ల్లో గూర్ఖాలాండ్ పేరుతో ఉద్యమం సాగింది. 1995లో ప్రత్యేక కామత్ పూర్ పేరుతో ఆందోళనలు సాగాయి. 1998లో గ్రేటర్ కుచ్ బెహార్ తో పోరాటాలు కొనసాగాయి. ఉత్తర బెంగాల్ ప్రాంతాలతోపాటు పొరుగునున్న అసోంలోని ధుబ్రి, కోక్రార్ఝర్, గోపాల్ పూర్, బొంగైగావ్ జిల్లాలను కలిపి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని గతంలో ఉద్యమాలు జరిగాయి. ఇతర రాష్ట్రంలోని ప్రాంతాలను కలపడం అంత తేలికైన విషయం కాదు. ఉత్తర బెంగాల్ వెనకబడిన ప్రాంతమన్న విషయంలో ఎవరికీ రెండో అభిప్రాయం లేదు. అయితే ప్రత్యేక ప్రాంతమే ఇందుకు పరిష్కారమన్న వాదనలో ఏకాభిప్రాయం లేదు. మమతను ఇరుకున పెట్టేందుకే కేంద్ర పెద్దల ప్రోత్సాహంతో స్థానిక కమలం ఎంపీలు ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారన్న వాదనను తోసిపుచ్చలేం.

# వైసీపీ వైపు... వంగవీటి చూపు



విజయవాడ, జూలై 8 (న్యూస్ పల్స్)వంగవీటి మోహన రంగా అన్న పేరు వింటేనే వైబ్రేషన్స్ వస్తాయి. ఒక్కసారే ఎమ్మెల్యేగా గెలిచినా కూడా నాడు బలంగా ఉన్న ఎన్టీఆర్ సర్కార్ ని కూలదోయడం వెనక రంగా పోరాటంతో పాటు ఆయన బలిదానం కూడా ఉంది. అటువంటి రంగా వారసత్వం రాజకీయాల్లో గట్టిగా లేకపోవడం విషాదమే. రంగాను నమ్ముకుని వచ్చిన వారు పెద్ద నాయకులు అయ్యారు. కానీ రంగా కుమారుడు వంగవీటి రాధాక్రిష్ణ మాత్రం ఎటూ కాకుండా పోయారు. ఆయన కాంగ్రెస్ తరపున 2004లో ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచారు ఆ తరువాత ప్రజారాజ్యం, వైసీపీ, టీడీపీలో చేరినా ఆయనకు మళ్ళీ చాన్స్ దక్కలేదు. ఇదిలా ఉంటే వంగవీటి రాధ వైసీపీలో చేరాలని గట్టిగానే నిర్ణయించుకున్నారుట. వచ్చే ఎన్నికలలో పోటీ చేసి గెలవాలంటే వైసీపీయే తనకు సరైన వేదిక అని భావిస్తున్నారుట. వైసీపీ నుంచి 2014 ఎన్నికల్లో పోటీ చేసిన ఓడిన వంగవీటి రాధాను 2019 ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి ఎంపీగా పోటీ చేయమని జగన్ కోరారు. దాంతో ఆయన అలిగి వైసీపీలో ఉండకుండా టీడీపీలో చేరారు. టీడీపీకి ఆయన మద్దతు ఇచ్చినా కూడా ఆ పార్టీ ఓడింది. వంగవీటి రాధాకు కూడా ఏ మాత్రం అక్కడ రాజకీయ లాభం కలగలేదు. పైగా ఇపుడు విజయవాడలో టీడీపీ గతంలో ఎన్నడూ లేనంత బలహీనంగా ఉంది. దాంతో రాధాకృష్ణ జగన్ కి జై అంటున్నారుట. గోదావరి జిల్లాలకు చెందిన తోట త్రిమూర్తులకు జగన్ ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చారు. దాంతో పాటు జగన్ వద్ద ఆయనకు పరపతి పెరిగింది. త్రిమూర్తులుకు కాపుల్లో ఉన్న బలాన్ని చూసే జగన్ ప్రయారిటీ ఇస్తున్నారు. దీంతో వచ్చే ఎన్నికల నాటికి కాపులను సంఘటితం చేసి వైసీపీకి అనుకూలంగా చేసే బాధ్యతను ఆయన నెత్తికెత్తుకున్నారు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ని వంగవీటి రాధా ఈ మధ్యన కలిసి చర్చలు జరిపారు అని ప్రచారం సాగుతోంది. ఈ ఇద్దరు మధ్యన చర్చలు అంతా వైసీపీలోకి వంగవీటి రాధాను తీసుకురావడం కోసమే జరిగాయని అంటున్నారు. రాధా కూడా త్రిమూర్తులు చెబితే జగన్ వింటారు కాబట్టి తనకు మళ్ళీ అక్కడ చోటు దక్కుతుంది అనుకుంటున్నారుట.వంగవీటి రాధా జగన్ ని గతంలో నానా మాటలు అన్నారు. ఆయన ఓటమిని గట్టిగా కోరుకున్నారు. మరి జగన్ రాధా రాకను ఆహ్వానిస్తారా అన్నది కూడా చర్చగా ఉంది. అయితే వచ్చే ఎన్నికలు కీలకం కాబట్టి జగన్ ఎవరు వచ్చినా కాదనరు అంటున్నారు. అంతే కాదు, ఎంత కాదనుకున్న రంగా వారసుడిగా వంగవీటి రాధాకు ఇమేజ్ ఉంది. దాంతో పాటు కాపుల ఓట్లు కూడా వైసీపీకి కావాలి. దాంతో జగన్ వంగవీటి రాధాను తిరిగి పార్టీలో చేర్చుకుంటారు అన్న మాట ఉంది. అదే జరిగితే విజయవాడ రాజకీయాలు కొత్త మలుపు తీసుకోవడం ఖాయం. అదే విధంగా వైసీపీలో కూడా సమీకరణలు మారుతాయని అంటున్నారు.

# జలకళ సంతరించుకున్న చెరువులు

విజయవాడ, జూలై 8, (న్యూస్ పల్స్)బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పశ్చిమ కష్ణాలోని నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు, నూజివీడు ప్రాంతాల్లో సాగు చేసిన లక్ష ఎకరాల్లో పత్తి పంటకు జీవం పోసినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నందిగామ, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండల పరిధిలో రైతులు ఈ ఏడాది మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. పొలాల్లో వేసిన విత్తనాలు మొలకెత్తి ఏపుగా పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ రెండో వారం నుండి రుతుపవనాల ప్రభావంతో తొలకరి ప్రారంభం కావడంతో నాటిన విత్తనాలు మొలిచి మొక్కలు పెరుగుతున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగమయ్యారు. మూడేళ్ల తర్వాత ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో డెల్టా గ్రామాల్లోని పంట కా లువల్లో నీరు ప్రవహించడంతో రైతుల కళ్లలో సంతోషం కనపడుతోంది. సకాలంలో ఏలూరు కాలువకు నీరు విడుదల చేసిన ప్రభుత్వం. ఖరీఫ్‌లో 40 శాతం మాత్రమే కాలువకు నీరు విడుదల చేస్తే, మిగిలిన 60 శాతం వర్షాదారంగా సమకూరుతోందని ఇరిగేషన్ అధికారుల అంచనా. అయితేమారిన వాతావరణ పరిస్థితులల్లో గత మూడేళ్లుగా వర్షాలు సకాలంలో పడటం లేదు. దీంతో 80 శాతం నీటికి కాలువపైనే ఆధార పడాల్సి వచ్చింది. ఈ ఏడాది పూర్తి స్థాయిలో నీరు విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇపుడు నారుమళ్లు పోస్తేనే సకాలంలో నాట్లు పడి పంట కోతలసమయంలో తుఫాన్ భారిన పడకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు. డెల్టా గ్రామాలైన కేసరపల్లి, జక్కులనెక్కలం, సావరగూడెం, అజ్జంపూడి, బుద్దవరం, దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల్లో 7,600 ఎకరాల్లో వరి సాగవుతోంది. గత మూడేళ్లుగా నీటి ఇబ్బందులు వచ్చినా తట్టుకుని సాగు చేపట్టారు. తుఫాన్ల ప్రభావం వల్ల రెండేళ్లు నష్టపోయారు. గతేడాది తుఫాన్ల తాకిడి లేకపోవడంతో పంట రైతుల చేతికి వచ్చింది. గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడ్డారు. మిల్లర్ల వద్దకు ధాన్యం వెళ్లిన తర్వాత రేట్లు పెరిగాయి. దీనితో పాటే మార్కెట్‌లో బియ్యం రేట్లూ పెరగడంతో రైతులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ఈసారి సకాలంలో నీరు విడుదల చేయడంతో రైతులు నార్లుపోసేందుకు సిద్దమవుతున్నారు. ఆగస్టు వరకు నీరొస్తే నాట్లు పడతాయని, ఆతర్వాత వర్షాలు పడితే సాగుకు ఇబ్బందులు ఉండవని అంటున్నారు. ఒకవేళ వర్షం లేకుంటే కాలువ నీటిపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణలోకితీసుకొచ్చి కాలువలకు నీరు వదిలిపెడుతోంది. దీంతో మెట్ల గ్రామాల్లో చెరువులకు నీరు పెట్టే పనిలో రైతులున్నారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. రహదారులపై బురద నీరు చేరుకుంది. రహదారి ప్రక్కన డ్రెయిన్లు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతుంది. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

# ఏపీకి శాపంగా రాజకీయ విభేధాలు...

విజయవాడ, జూలై 8, (న్యూస్ పల్స్)రాజకీయ వైరుధ్యాలు.. రాష్ట్రానికి శాపంగా మారాయా ? ఏపీ సీఎం.. జగన్.. అనుసరిస్తున్న వైఖరిపై మేధావులు అంటున్న మాట ఇది..! ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయాయి. ఇప్పటి వరకు ఒక్క ప్రతిష్టాత్మక కంపెనీ కూడా రాష్ట్రానికి రాలేదు. పోనీ.. రాష్ట్ర ప్రభుత్వమైనా.. ఏ కంపెనీనైనా ఆహ్వానించిందా ? అంటే అది కూడా లేదు. ఇప్పటి వరకు చేసిందల్లా సంక్షేమం పేరిట పంపకాలే.. అంటున్నారు మేధావులు. నిజానికి ప్రజా సంక్షేమం కూడా రాష్ట్ర అభివృద్ధితోనే ముడి పడి ఉంటుంది. రాష్ట్ర ఆదాయం పెరిగితే.. ప్రజలకు మరింత సంక్షేమం చేసే అవకాశం లభిస్తుంది. అయితే.. ఈ కీలక సూత్రాన్ని తోసిరాజని.. జగన్ సర్కారు వేస్తున్న అడుగులు.. రాష్ట్ర భవితకు ప్రశ్నార్థకంగా మారాయి. పెట్టుబడులు వచ్చేందుకు గుదిబండగా పరిణమించాయి. గత చంద్రబాబు పాలనలో అనేక ప్రతిష్టాత్మక కంపెనీలను ఏపీకి ఆహ్వానించారు. ఈ క్రమంలో ఏటా జనవరిలో పెట్టుబడుల సదస్సును నిర్విరామంగా నాలుగేళ్లు కొనసాగించారు. వివిధ దేశాల ప్రముఖ కంపెనీలకు ఆహ్వానం పలికేవారు. దీంతో చాలా కంపెనీలు వచ్చాయి. వాటితో ఒప్పందాలు కూడా చేసుకున్నారు. ఈ క్రమంలోనే స్థలాలు, విద్యుత్.. నీరు.. వంటి విషయాల్లో ప్రభుత్వం రాయితీ ఇచ్చింది. ఆయా కంపెనీలు పనులు ప్రారంభిస్తే.. స్థానికంగా యువతకు ఉపాధి లభించి.. రాష్ట్రంలో ఆదాయం పెరుగుతుందని చంద్రబాబు భావించారు. అయితే బాబు చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన కంపెనీలు.. ప్రారంభానికి అడుగులు వేసే సరికి ప్రభుత్వం మారిపోయింది. బాబు దిగిపోయి.. జగన్ వచ్చారు. దీంతో అప్పటికే చేసుకున్న ఒప్పందాలను గౌరవించి.. ఆయా కంపెనీలను సంస్థలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాల్సిన జగన్.. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారు. అదే సమయంలో కొందరు అమ్యామ్యాలకు కూడా చేతులు చాచారని.. వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో సదరు కంపెనీలు బిచాణా ఎత్తేస్తున్నాయి. మరి ఇలా జరుగుతున్న సమయంలో అసలు ఏం జరిగింది? అనేవిషయంపై దృష్టి పెట్టి.. వాటిని ఆపే బాధ్యత.. కొత్త కంపెనీలను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత జగన్‌పై ఉంది. కానీ, జగన్ అలా చేయలేదు. ఎందుకంటే.. “అవన్నీ.. బాబు తెచ్చిన కంపెనీలు‘ ఇప్పుడు వాటిని బ్రతిమాలితే.. వాటికి రాయితీలు ఇస్తే.. తన ఇజ్జత్ ఏంటి? తన హయాంలో వచ్చాయని ఎవరు చెప్పుకొంటారు. రేపు పేరంతా.. బాబుకు వెళ్లిపోదా..? ఇదీ.. జగన్ ఆలోచన ఫలితంగా.. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే అవకాశం లేకుండా పోగా.. ఉన్నవి కూడా పోతున్నాయి. ఈ రాజకీయ వివాదంలో అక్షరాలా నలిగిపోతోంది.. నవ్యాంధ్రే అంటున్నారు పరిశీలకులు.

# కన్నా.. ఫ్యూచరేంటో...



గుంటూరు, జూలై 8, (న్యూస్ పల్స్)కేంద్ర మంత్రి వర్గ ప్రక్షాళన దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో ఎనిమిది రాష్ట్రాల గవర్నర్ల మార్పులు.. చేర్పులు ప్రక్రియ చేపట్టారు. ఈ క్రమంలోనే ఎవ్వరూ ఊహించని విధంగా ముందుగా లీకులు కూడా లేకుండానే ఏపీకి చెందిన కంభంపాటి హరిబాబుకు మిజోరం గవర్నర్ పదవి కేటాయించారు. అలాగే మరో తెలుగు వ్యక్తి.. తెలంగాణకు చెందిన కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ స్థానచలనం కలిగింది. ఇప్పటికే కేంద్ర మంత్రి వర్గంలో ఉన్న థావర్‌చంద్ గెహ్లాట్‌ను కర్నాటక గవర్నర్‌గా నియమించడం గమనార్హం. వాస్తవంగా చెప్పాలంటే 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏపీలో బీజేపీకి చెందిన ఓ వ్యక్తి కి ఇంత పెద్ద పదవి రావడం ఇదే మొదటిసారి. ఏపీ బీజేపీలో గత ఏడెనిమిది సంవత్సరాలుగా ఎంతో మంది పదవులు ఆశిస్తున్నారు. సుజనా చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్ లాంటి వాళు గత ఎన్నికల్లో బిజెపి గెలిచిన తర్వాత కానీ పార్టీలో చేరలేదు. వీరి సంగతి కాసేపు పక్కన పెడితే కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి ఇలాంటి వాళ్లు 2014 ఎన్నికలకు ముందే కేంద్ర మంత్రి హోదాలో ఉండి మరి బీజేపీలో చేరారు. వాళ్లను కూడా బిజెపి జాతీయ నాయకత్వం పట్టించుకోవడం లేదు. వాళ్లకు పార్టీ పదవులు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ఒక రాజ్యసభ లేదా కేంద్ర సహాయ మంత్రి పదవి కానీ ఇచ్చేందుకు ఎంత మాత్రం ఇష్టపడటం లేదు. పార్టీలో ఎన్నో ఏళ్లుగా కమిట్‌మెంట్‌తో పని చేస్తోన్న కంభంపాటి హరిబాబుకు ఈ పదవి వచ్చేందుకు కూడా ఏడు సంవత్సరాలు వెయిట్ చేయాల్సి వచ్చింది. ఇక ఇప్పుడు పురందేశ్వరి, కన్నా లక్ష్మీ నారాయణ లాంటి వాళ్ల పరిస్థితి ఏంటన్నదే ప్రశ్నార్థకంగా మారింది. కన్నా లక్ష్మీనారాయణ గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరేందుకు రెడీ అయ్యి.. అన్ని ఏర్పాట్లు చేసుకుని మరీ బీజేపీలోకి వెళ్లారు. ఫలితంగానే ఆయనకు ఏపీ బీజేపీ పగ్గాలు వచ్చాయి. నరసారావుపేట నుంచి బీజేపీ తరపున పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఎంపీగా పోటీ చేసి చిత్తుగా ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన పదవి, పనితీరు విషయంలో ఏ మాత్రం సంతృప్తిగా లేని బీజేపీ జాతీయ నాయకత్వం ఆయన్ను ఏపీ బీజేపీ బాధ్యతల నుంచి కూడా తప్పించేసింది. టీడీపీతో లాలూచీ పడుతున్నారన్న ఆరోపణలు కూడా ఆయన పదవి ఊస్టింగ్‌కు ఓ కారణం. అప్పటి నుంచి కన్నా లక్ష్మీ నారాయణ తనకు ఏదో ఒక పదవి వస్తుందని ఆశల పల్లకీలో మునిగి తేలుతూనే ఉన్నారు. కన్నా రాజ్యసభ కోసం రెండు మూడు సార్లు లాబీయింగ్ చేశారు. మధ్యలో పార్టీ మారతానని పరోక్ష హెచ్చరికలు, బెదిరింపులు కూడా చేశారు. అయితే ఇవేవీ బీజేపీ జాతీయ నాయకత్వం పట్టించుకోలేదు సరికదా ? కన్నా లక్ష్మీ నారాయణను లైట్ తీస్కొంది. చివరకు కన్నా బీజేపీలో ఉన్నా పదవులు రావడం లేదు? పార్టీ మారినా ఆయన్ను ఎవ్వరూ గౌరవించే పరిస్థితి లేదు. ఈ క్రమంలోనే ఏదో ఒక పదవి ఎప్పుడో కప్పుడు వస్తుందని కన్నా లక్ష్మీ నారాయణ కాలం వెళ్లదీయడం తప్పా ఇప్పట్లో చేసేదేం లేదు. కన్నా కంటే ముందే పురందేశ్వరికి ఏదో ఒక పదవి వచ్చే అవకాశాలే ఎక్కువ.

## మార్కెట్ రేట్లతో పోటీ పడుతున్న రేషన్

నెల్లూరు, జూలై 8, (న్యూస్ పల్స్)ఇప్పటి వరకు చౌక దుకాణాల నుంచి ప్రభుత్వం అందిస్తున్న కంది పప్పు, పంచదార మరింత ప్రియం కానున్నాయి. దీంతో ఇక నుంచి పేద ప్రజలకు కంది పప్పు, చక్కెర అందని ద్రాక్షగా మారనున్నాయి. ప్రభుత్వం వీటి రేట్లు భారీగా పెంచాలని నిర్ణయం తీసుకోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. కంది పప్పుపై రూ. 27, పంచదారపై రూ. 7 అదనంగా పెంచనున్నట్లు తెలిసింది. పెంచిన రేట్లు జూలై మాసం నుంచి అమల్లోకి రానున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పెంచిన ధరల అమలుకు సంబంధించి జిల్లాలోని పౌర సరఫరా అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందినట్లు సమాచారం. ఇప్పటి వరకు కిలో కంది పప్పును రూ. 40కు అందిస్తున్నారు. అర కిలో పంచదారను రూ. 10కు సరఫరా చేస్తున్నారు. అయితే కొత్త ధరల ప్రకారం కిలో కంది పప్పును రూ. 67 కి, పంచదార రూ.17కి పెరగనుంది. మరో వైపు కార్డు దారులపై కూడా పెద్ద ఎత్తున ఆర్థిక భారం పడనుంది. జిల్లాలో మొత్తం 12,92,950 బియ్యం కార్డులున్నాయి. కార్డుల్లోని సభ్యులు సుమారు 35,98,438 మంది వరకు ఉన్నారు. పెంచిన ధరల ప్రకారం కంది పప్పు, చక్కెర కలిపి ప్రజలపై నెలకు సుమారు రూ. 4.40 కోట్లు అదనంగా భారం పడనుంది. అంటే కంది పప్పుపై రూ. 3.50 కోట్లు, చక్కెరపై రూ. 90. 50 లక్షలు వరకు అదనంగా భారం పడే అవకాశం ఉంది. ఇవి కాకుండా అంత్యోదయ అన్నా యోజన కార్డులు 63వేల వరకు ఉన్నాయి. వీటిపై ఆధారపడిన సభ్యులు 1.53 లక్షల వరకు ఉన్నారు. అయితే వీరికి కూడా పెంచిన ధరల ప్రకారమే కంది పప్పును సరఫరా చేయాలనే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే దాదాపు రూ. 17 లక్షల వరకు కార్డుల దారులపై అదనపు భారం పడనుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కంది పప్పు, చక్కెర లభించే రేట్లకు, రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయనున్న రేట్లకు పెద్దగా తేడా ఏమీ కనిపించడం లేదు. మార్కెట్‌లో వివిధ రకాల కంది పప్పు అందుబాటులో ఉంటుంది. ఏ రకం కంది పప్పు తీసుకున్నా కాస్తా అటు ఇటుగా సగటున ప్రస్తుతం మార్కెట్లో కిలో కంది పప్పును రూ. 65 నుంచి రూ. 70 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని రకాలు అంత కంటే తక్కువ రేట్లకు కూడా దొరుకుతున్నాయి. కిలో చక్కెరను రూ. 34 నుంచి రూ. 38 వరకు అమ్ముతున్నారు. మరి కొన్ని రకాలైన పంచదారను రూ. 40 నుంచి రూ. 48 వరకు అమ్ముతున్నారు.

## శిల్పా కోసం పదవులు ఎదురు చూపు

కర్నూలు, జూలై 8, (న్యూస్ పల్స్)శిల్పా మోహన్ రెడ్డి.. సీ?నియర్ నేత. నంద్యాలలో వైసీపీలో ప్రముఖ నేత. ఆయన రాజకీయాల నుంచి తప్పుకుని తన కుమారుడు రవిచంద్ర కిశోర్ రెడ్డికి గత ఎన్నికల్లో అవకాశమిచ్చారు. దీంతో ఆయన రాజకీయంగా దూరంగా ఉంటున్నారు. కుమారుడు ఎమ్మెల్యే అయినా నంద్యాల నియోజకవర్గంలో ఆయనదే ఆధిపత్యం. ఇప్పటికీ నియోజకవర్గంలో ఆయన చెప్పినట్లే నడుస్తుంది. ఇవి పక్కన పెడితే శిల్పా మోహన్ రెడ్డికి ఒక పదవి వేచిచూస్తుందన్న టాక్ విన్పిస్తుంది. శిల్పా మోహన్ రెడ్డి 2017లో వైసీపీలో చేరారు. అప్పటి వరకూ ఆయన తెలుగుదేశం పార్టీలోనే ఉన్నారు. భూమానాగిరెడ్డి టీడీపీలో చేరడంతో ఆయన వైసీపీలోకి వచ్చారు. నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలో ఆయన పోటీ చేసి భూమా బ్రహ్మానందరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో ఆయన తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. అందుకే 2019 ఎన్నికల్లో శిల్పా మోహన్ రెడ్డి తాను పోటీ చేయకుండా కుమారుడిని బరిలోకి దింపి నెగ్గించుకున్నారు. ఇక ఇప్పుడు శిల్పా మోహన్ రెడ్డి కోసం ఒక పదవి ఎదురు చూస్తుంది. అదేంటంటే తన సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ పదవి. 2017లో తన సోదరుడుశిల్పా మోహన్ రెడ్డి టీడీపీని వీడి వైసీపీలో చేరడంతో అప్పుడే ఎమ్మెల్సీ గా ఎన్నికైన శిలపా చక్రపాణిరెడ్డి కూడా వైసీపీలో చేరారు. కానీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని జగన్ షరతు పెట్టడంతో ఆయన ఎమ్మెల్సీ పదవి ఆరేళ్ల సమయం ఉన్నా రాజీనామా చేశారు. స్థానిక సంస్థల ఎన్నిక కావడంతో ఆయన తర్వాత టీడీపీ నుంచి కేఈ ప్రభాకర్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ ఎమ్మెల్సీ పదవీ కాలం వచ్చే ఏడాదితో పూర్తికానుంది. స్థానిక సంస్థల కోటా కావడంతో ఈసారి ఈ స్థానం నుంచి శిల్పా మోహన్ రెడ్డికి అవకాశం కల్పించాలన్న డిమాండ్ విన్పిస్తుంది. అయితే ఒకే కుటుంబంలో ముగ్గురికి అవకాశం ఇస్తారా? అన్న ప్రశ్న తలెత్తుతున్నా, ఆ స్థానం శిల్పా కుటుంబం త్యాగం చేసిందని చెబుతున్నారు. మొత్తం మీద శిల్పా మోహన్ రెడ్డి కోసం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎదురు చూస్తుంది.

## వ్యాన్ బోల్తా?25 మందికి గాయాలు

రంపచోడవరంతూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి మండలం సున్నంపాడు సమీపంలోని అటవీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడటంతో సుమారు 25 మంది కి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను రంపచోడవరం, మారేడుమిల్లి ఆసుపత్రులకు తరలించారు. బాధితులు విశాఖపట్నం జిల్లా కొయ్యూరు మండల గౌడుగులమామిడి గ్రామస్తులుగా గుర్తించారు. కొంతమంది స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

# స్టీల్ ప్లాంట్ లో ఆందోళన తీవ్ర తరం

విశాఖపట్నం జూలై 8, (న్యూస్ పల్స్)విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఆందోళన తీవ్ర తరం చేసాయి. ప్లాంట్ లోనికి వెళ్ళకుండా కార్మికులు గేటు వద్దే కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. స్ట్రేటజిక్ సేల్ కు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షలు 147 రోజులకు చేరాయి. కేంద్రం వెనక్కు తగ్గకుండా ప్లాంట్ ను అమ్మేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. అందుకు సంబంధించి న్యాయ పరమైన సమస్యలు తలేత్తకుండా, లిగల్ ఎడ్వజరీ కమిటీని ఎర్పాటు చేసింది. దీంతో కార్మికులు ఆందోళన తీవ్రతరం చేసారు. మెయిన్ గేటు వద్ద వేలాదిగా కార్మికులు చేరుకుని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. గేటు ముందే కుర్చుని ఆందోళన చేసారు. ప్రవేటు పరం చేస్తే చూస్తూ వూరుకోమని హెచ్చరించారు. స్టీల్ ప్లాంట్ నిర్వాసితులు ఇళ్ళు, భూములు త్యాగం, 32మంది అమరవీరుల త్యాగం, కార్మికులు కష్టం విశాఖ స్టీల్ .... ఇది స్టీల్ ప్లాంట్ కాదు. ఆధునిక దేవాలయం. స్ట్రేటజిక్ సేల్ విషయాన్ని వెనక్కుతీసుకునేంతవరకు ఆందోళన ఆగదని అన్నారు.

# విశాఖలో వైఎస్సార్ జయంతి

విశాఖపట్నంజూలై 8, (న్యూస్ పల్స్) మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి 72వ జయంతి సందర్భంగా వైసీపీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. విశాఖలో వైయస్సార్ విగ్రహానికి మంత్రి అవంతి శ్రీనివాస్, పార్టీ నేతలు పూల మాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భం గా రాష్ట్ర మంత్రి అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ ... ప్రజల గుండెల్లో ఎప్పుడు చిరస్థాయిగా ఉండిపోయే వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి. పేదవాడి గుండె చప్పుడు బాగా తెలిసిన వ్యక్తి. తెలుగువారికి బ్రాండ్ అంబాసిడర్ ఆయన. తెలుగు జాతి ఉన్నంత కాలం చరిత్రలో రాజశేఖరరెడ్డి నిలిచిపోతారు. దేశంలో సంక్షేమ విప్లవం తీసుకువచ్చిన వ్యక్తి వైఎస్ఆర్. తండ్రి బాటలోనే సీఎం వైఎస్ జగన్ పయనిస్తున్నా రు. సంక్షేమం కోసం రాజశేఖరరెడ్డి రెండు అడుగులు ముందుకు వేస్తే సీఎం జగన్ వంద అడుగులు ముందుకు వేస్తున్నారు. అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వంశీకృష్ణ, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి, పార్టీ కన్వీనర్ కేకే రాజు, మళ్ళ విజయ ప్రసాద్, అక్రమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు పంచకర్ల, చింతలపూడి, తైనాల విజయ్ కుమార్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు

ఎమ్మిగనూరు జూలై 8, (న్యూస్ పల్స్) పట్టణంలో కాంగ్రెస్ వీరవిదేయుడుగా,కాంగ్రెస్ ఊపిరిగా ప్రజల కోసం నిత్యం పరితపించి... ఇటుప్రజలకు,అటుపార్టీకి తనవంతు సేవలందించి తెలుగుప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మన ప్రియతమ మహానాయకుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి 72వ జయంతోత్సవం సంధర్భంగా ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కె. లక్ష్మీ నారాయణ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి ఖాసిం వలి, ఆధ్వర్యంలో గురువారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి, కేక్ కట్ చేసి , కాంగ్రెస్ పార్టీ కి ఆయన అందించిన సేవలను కొనియాడారు. రైతులకు ప్రజలకు యువతకు , విద్యార్థులకు అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఢిల్లీ స్థాయిలో రాజశేఖర్ రెడ్డి మంచి అరుదైన గౌరవం ఉండేదని, ఇలాంటి మహోన్నతమైన వ్యక్తి గా కాంగ్రెస్ పార్టీకి సేవలందించారని, ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్యుఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ యాదవ్, చాంద్ భాషా, ఆసిఫ్, తెలుగు రాజు, షేక్షావలి,చిన్న రంగస్వామి, సోము, తదితరులు పాల్గొన్నారు

# మదనపల్లెలో రైతుల అందోళన

చిత్తూరుజూలై 8, (న్యూస్ పల్స్)దేశంలోనే అతిపెద్ద టమోటా మార్కెట్ అయిన మదనపల్లెలో రైతులకు జరుగుతున్న అన్యాయంపై రైతాంగం రోడ్డెక్కారు. మార్కెట్ ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. వీరికి సిపిఎం నాయకులు శ్రీనివాసులు మద్దతు పలికారు. గంటపాటు రహదారిపై వాహనాలు నిలచిపోవడంతో పట్టణ సిఐలు నరసింహులు, ఈదుర్ బాషా అక్కడికి చేరుకున్నారు. పోలీసులతో రైతులు, సిపిఎం శ్రీనివాసులు వాగ్వివాదం చేశారు. సిఐ నరసింహులు ఎమ్మెల్యే నవాజ్ బాషా, డియస్పీ రవిమనోహరాచారి తో సంప్రదించి దర్నా విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ జాక్ పాట్ విధనం రద్దు చేయాలని, కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, వ్యాపారులు, మండి యజమానులు కుమ్మకై రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోతున్నారు. తక్కువ ధరలు ఇవ్వడం, జాక్ పాట్ పేరుతో రైతులకు మోసం చేయడం జరుగుతోందని, టమోటా మార్కెట్ సెక్రటరీ రైతుల తీవ్ర అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. కనీసం రైతులను పట్టించుకోవడా సెక్రటరీ తన స్వలాభం చేసుకుంటున్నాడని, మార్కెట్ లో రైతులకు కనీస సదుపాయం కల్పించడం లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా టమోటా మార్కెట్ నమ్ముకుని వ్యాపారులు చేసే వారికి స్థానిక లారీ అసోసియేషన్ సభ్యులు రాకుండా పట్టుపట్టడం, చందా వసూలు చేయడం, వ్యాపారులు లారీ యజమానుల మధ్య వివాదం ముదిరింది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం...

విశాఖపట్టణం, జూలై 8, (న్యూస్ పల్స్)వాయువ్య బంగాళాఖాతంలో ఈ నెల 11న అల్పపీడనం ఏర్పడనుంది. ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో, పశ్చిమ మధ్య, దాన్ని అనుకుని ఉన్న వాయవ్య బంగాళాఖాతంలో జులై 11న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర బిహార్ నుంచి ఏర్పడిన ఉత్తర దక్షిణ ఉపరితల ద్రోణి.. ప్రస్తుతం ఝార్ఖండ్ నుంచి ఇంటీరియర్ ఒడిశా మీదుగా.. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల వద్ద కొనసాగుతోంది.ఉపరితల ద్రోణి ప్రభావంతో గురు శుక్రవారాల్లో కోస్తా ప్రాంతంలో తీరం వెంబడి గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో పాటు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమ, కోస్తాలోని మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడతాయని అని అమరావతి వాతావరణ శాఖ డైరెక్టర్ స్టెల్లా తెలిపారు.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రెండ్రోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో అత్యధికంగా 135 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తూర్పుగోదావరి జిల్లా పెదపూడిలో 125, కాకినాడలో 92.5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది

# సంక్షోభంలో సాగర్ కుడికాల్వ ఆయకట్టు



గుంటూరు,జూలై8: ప్రస్తుత జల వివాదాలతో ఉన్న నీటిని తెలంగాణ ప్రభుత్వం విద్యుత్‌కు తోడేస్తున్న క్రమంలో సాగర్ కుడికాలువ ఆయకట్టు ప్రమాదం పడిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్ననీటిని విద్యుత్ కోసం తోడేయడంతో నీరు వృధాగా సముద్రంలోకి వదలాల్సి వస్తోంది. దీంతో కుడి కాలువ ఆయకుట్టులో పంటల సాగునే సంక్షోభంలోకి నెట్టివేస్తోంది. మొత్తం మీద వరద రాకుంటే సాగర్ ఆయకట్టులో పంటల సాగును ఈ ఏడాది రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది. దీంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో ముందుకు సాగాలని సూచిస్తున్నారు. సాగర్ నుంచి నీటిని వినియోగించుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం మోకాలడ్డుతున్నది. మరో వైపు రాయలసీయ ప్రాంతానికి శ్రీశైలం నుంచి నీటిని తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నది. అయితే సాగర్ రైతుల ప్రయోజనాల గురించి ఆలకించేవారే లేకుండాపోయారన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. కుడి కాలువకు ఉన్న నికర జలాల హక్కును పాలకులు హరించి వేస్తున్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11.16 లక్షల ఎకరాల ఆయకుట్టు ఉంది. అయినా ఈ రైతుల గురించి ఆలోచించకుండా తెలంగాణ ప్రభుత్వం సాగర్ నుంచి రోజు ఐదు టీఎంసీలకు పైగా నీటిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తూ వృథా చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా వ్యవహరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో గోదావరి జలాల ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇందుకోసం ఇరు జిల్లాలలోని ప్రజాప్రతినిధులు కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పట్టిసీమ

## తెలంగాణ తీరుతో నీట సంక్షోభం తప్పదేమో
## పట్టిసీమతో పూర్తిస్థాయి ఎత్తిపోతలే శరణ్యం
## ఆయకట్టు రైతుల ఆందోళన

పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సరఫరా చేస్తుండటంతో ఆ ప్రాంతంలో రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇదే తరహాలో నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టులో సాగు నీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా గత ప్రభుత్వం భావించింది. గోదావరి పెన్నా నదుల అనుసంధానం పథకం తొలిదశలో గోదావరి జలాలను కుడి కాలువకు తరలించేం దుకు గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని రూపొందించింది. ఈ పథకాన్ని చేపట్టేందుకు గత ప్రభుత్వం నకరికల్లు వద్ద శంకుస్థాపన చేసింది. ఈ పథకంతో ఇరు జిల్లాల్లోని సుమారు 10 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు సరఫరా చేయవచ్చు. ఈ నీటిని ప్రకాశం బ్యారేజి ఎగువున వైకుంఠపురం నుంచి సాగర్ కుడి కాలువకు తరలించాలని నిర్ణయించారు. ఈ ఎత్తి పోతల పథకం పూర్తి చేయటం ద్వారా ఏడు వేల క్యూసెక్కుల నీటిని కుడి కాలువకు తరలించాలని ప్రణాళిక రూపొందించారు. అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, బెల్లంకొండ, రాజుపాలెం మండలాల మీదగా నకరికల్లు మండలంలోని సాగర్ కుడి ప్రధాన కాలువలో నీటిని కలిపేలా డిజైన్ చేశారు. ఈ పథకం పూర్తయితే సాగర్ ఆయకట్టు సాగునీటి సంక్షోభం పరిష్కారమవు తుందని, ప్రతి ఏటా వరి సాగయ్యే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకాన్ని ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందో లేదో అన్న సందేహాలు ఆయకట్టు రైతుల్లో నెలకొంటున్నాయి. ఎత్తిపోతల పథకం నిర్మించే ప్రాంతంలో నామమాత్రంగా భూసేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఈ పనులు కూడా ముందడుగు వేయడంలేదు. ఈపథకంపూర్తయితేఆయకట్టులోసాగుచిత్రంపూర్తిగా మారుతుందని రైతులు అంటున్నారు. భవిష్యత్తులో సాగర్ ఆయకట్టుకు అవాంతరాలు తలెత్తకుండా ఈ పథకాన్ని పూర్తి చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో గోదావరి జలాల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని సాగర్ కుడికాల్వ పరిధిలోని 10 లక్షల ఎకరాలకు గోదావరి జలాలతో ఊపిరిఇవ్వవచ్చు. ఇరుజిల్లాలప్రజాప్రతినిధులు ఈ దిశగా ప్రయత్నం చేసి ఈ పథకాన్ని పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

# బెజవాడలో హిజ్రాల మాఫియా

విజయవాడ, జూలై 8, (న్యూస్ పల్స్)విజయవాడ నగరంలో హిజ్రాల ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయి. రెండు గ్రూపులుగా ఏర్పడిన వీరు పోటాపోటీగా బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. రైళ్లు, రైల్వేస్టేషన్లలో వీరి ఆడగాలపై పోలీసులు నిఘా పెట్టినా దాడులు ఆగడం లేదు. ప్రయాణ ప్రాంగణాలకు వస్తున్న వారిని వెంబందించి వేధించి అందినంత దోచుకుంటున్నారు. ఇది చాలదన్నట్లు కొందరు అమాయక యువకులను వలలో వేసుకుని లింగ మార్పిడి చేయించ హిజ్రాలుగా మార్చేస్తున్నారు.వీరి ఆగడాలపై నిఘా పెట్టిన విజయవాడ పోలీసులకు ఇటీవల షాకింగ్ విషయం తెలిసింది. రాజరాజేశ్వరీపేట కేంద్రంగా లింగ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నట్లు రైల్వే పోలీసుల విచారణలో బయటపడింది. ఓ డాక్టర్ ఒక్కో సర్జరీకి రూ.30వేలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో తిరిగే యువకులకు హిజ్రాలు మాయమాటలు చెప్పి, గుట్టుచప్పుడు కాకుండా లింగ మార్పిడి ఆపరేషన్లు చేయించినట్లు బట్టబయలైంది. ఇలా ఏడాది కాలంలో సుమారు 50 మందికి లింగ మార్పిడి ఆపరేషన్లు చేసినట్లు వెలుగులోకి వచ్చింది.విజయవాడలోని హిజ్రాలు తమ వసూళ్ల కోసం రైళ్లను సైతం పంచుకున్నారు. విజయవాడ నుంచి సికింద్రాబాద్, చెన్నై, విశాఖపట్నం మార్గాలవైపు వెళ్లే రైళ్లను రెండు గ్రూపులకు చెందిన హిజ్రాలు పంచుకున్నారు. ఒక్కో రైల్లో ప్రయాణికుడి వద్ద రూ.100 ఇవ్వనిదే కదలడం లేదు. అందరిలోనూ వారి పరువు తీయడంతో పాటు దాడులకు సైతం పాల్పడుతున్నారు. బుధవారం ఉదయం రైల్వేస్టేషన్ వద్ద ఒక ప్రయాణికుడిని బెదిరించి రూ.5వేలు దోచుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.గతంలో గుడివాడ రైల్లో పాలిటెక్నిక్ చదివే ఒక విద్యార్థిని ఇదే తరహాలో బెదిరించగా.. డబ్బులు ఇవ్వకపోతే రైల్లో నుంచి తోసేశారు. ఆ విద్యార్థికి తీవ్ర గాయాలై రెండు కాళ్లు కోల్పోయాడు. హిజ్రాల దౌర్జన్యాలపై ఇటీవల కాలంలో సుమారు 100 మంది ప్రయాణికులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైళ్లలో హిజ్రాలు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీఆర్పీ సీఐ పి.శ్రీనివాస్ తెలిపారు. వీరి ఆగడాలపై రోజూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రయాణికుల రక్షణ కోసం మరింత నిఘా పెడతామని పేర్కొన్నారువిజయవాడ నగరంలో పెళ్లిళ్లు, ఏ ఫంక్షన్లు జరిగినా హిజ్రాలు నిమిషాల వ్యవధిలో అక్కడ వాలిపోతున్నారు. అవతలి వారి హోదాను బట్టి రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు డిమాండ్ చేస్తుంటారు. అడిగినంత డబ్బు ఇవ్వకపోతే అసభ్యంగా ప్రవర్తిస్తూ.. దుర్భాషలాడుతూ రెచ్చిపోతున్నారు.గాంధీనగర్‌లో రెండు రోజుల క్రితం ఒక దుకాణం ప్రారంభించగా 10 మంది హిజ్రాలు అక్కడికి వచ్చారు. యజమానిని రూ.30వేలు డిమాండ్ చేస్తూ నానా రభస చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినిపించుకోలేదు. వాళ్ల గొడవ భరించలేక ఆ వ్యాపారి చివరికి రూ.10వేలు సమర్పించుకున్నాడు.అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఒక రైల్వే ఉద్యోగి వారం క్రితం గృహ ప్రవేశం చేయగా హిజ్రాలు ఆ ఇంటి వద్ద గొడవ చేసి రూ.20వేలు తీసుకున్నాడు. నగరంలోని కండ్రిక, న్యూరాజరాజేశ్వరిపేట, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఎక్కువగా వీరు అరాచకాలకు పాల్పడుతున్నట్లు నగర పోలీసులు చెబుతున్నారు.

# ఆర్టీసీలో 1000 కోట్ల రచ్చ



హైదరాబాద్, జూలై 8, (న్యూస్ పల్స్)టీఎస్ఆర్టీసీలో రూ.వెయ్యికోట్ల వ్యవహారం ఆసక్తి రేకెత్తిస్తోంది. అధికారుల్లోనే కొందరు ఈ సొమ్ము శాంక్షన్ అయ్యిందంటే...మరికొందరు అబ్బే.. అలాంటిదేం లేదంటున్నారు. ఈ డబ్బులొచ్చాయని చెప్తే ఆర్టీసీ కార్మికులకు సంస్థ యాజమాన్యం బకాయి ఉన్న సీసీఎస్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్బీటీ రుణాలు చెల్లించమని ఎక్కడ అడుగుతారో అనే ఆందోళన కనిపిస్తున్నది. సీసీఎస్‌పై ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యం కోర్టు ధిక్కరణను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అందుకే ఈ రుణ మంజూరీపై యాజమాన్యం దోబూచులాడుతున్నది. పైగా నష్టాలు, డిఫాల్టర్ అంటూ మీడియాకు లీకులిస్తూ, కార్మికుల్ని గందరగోళపరుస్తున్నది. అదే సందర్భంలో ప్రభుత్వ గ్యారెంటీతో ఇస్తున్న ఈ రుణం విడతలవారీగా విడుదల అవుతుం దనీ, అందువల్లే తార్నాక ఆర్టీసీ ఆస్పత్రి పనులు నత్తనడకన నడుస్తున్నాయనీ ప్రచారం చేస్తు న్నది. ఇంతకీ అసలు ఈరుణం మంజూరీ అయ్యిందా లేదా అనే దానిపై యాజమాన్యం మాత్రం ఎలాంటి స్పష్టతా ఇవ్వట్లేదు. ఈ గంద రగోళాన్ని ఇలాగే కొనసాగించాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజరుకుమార్‌కు ప్రగతిభవన్ నుంచి ఆదేశాలు అందాయనే ప్రచారమూ జరుగుతున్నది. ఆర్టీసీపై రవాణాశాఖ మంత్రి స్వతంత్రించి నిర్ణయాలు తీసుకొనే పరిస్థితుల్లో లేరని ఇప్పటికే పలు సందర్భాల్లో కార్మిక సంఘాలు విమర్శలు చేశాయి. వాటిని సదరు మంత్రి కూడా పట్టించుకోనట్టే వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు టీఎస్ఆర్టీసీ యాజమాన్యం వివిధ ప్రభుత్వ, ప్రయివేటు రుణ సంస్థల నుంచి రూ.1,700 కోట్లు మాత్రమే అప్పుగా తీసుకున్నది. దీనిలో రూ.1,300 కోట్లు సంస్థ నేరుగా తీసుకున్నవి కాగా, మరో రూ.400 కోట్లు ప్రభుత్వ గ్యారెంటీ రుణాలు ఉన్నాయి. వీటన్నింటినీ యాజమాన్యం క్రమం తప్పకుండా చెల్లిస్తూనే ఉన్నది. కాకపోతే ఆర్టీసీ యాజమాన్యం చెల్లించని రుణాలు పూర్తిగా కార్మికులకు సంబంధినవే కావడం గమనార్హం. ఆర్టీసీ యాజమాన్యం స్వయంగా నిర్వహిస్తున్న కార్మికుల భవిష్యనిధి (పీఎఫ్) సొమ్ము రూ.1,400 కోట్లను సొంతానికి వాడేసుకుంది. దాన్ని చెల్లించట్లేదు. అలాగే ఆర్టీసీ కార్మికులకు చెందిన క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ (సీసీఎస్) సొమ్ము రూ.1,100 కోట్లు, స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీం (ఎస్ఆర్‌బీఎస్) నుంచి వాడుకున్న రూ.387 కోట్లు, స్టాఫ్ బెనెవలెంట్ ట్రస్ట్ (ఎస్బీటీ) నుంచి రూ.125 కోట్లతో సహా మొత్తంగా కార్మికులు దాచుకున్న రూ.3,012 కోట్లను యాజమాన్యం వాడేసుకుంది. వీటినీ చెల్లించట్లేదు. బయటి నుంచి తెచ్చుకున్న రుణాలను మాత్రం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. కార్మికుల సొమ్ము రూ.3,012 కోట్లు, వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రూ.1,700 కోట్లు మొత్తం కలిపి సంస్థపై ఉన్న అప్పుల భారం రూ.4,712 కోట్లు. రూ. వెయ్యి కోట్ల ప్రభుత్వ గ్యారెంటీ రుణం వచ్చిందని తెలిస్తే, కార్మికుల నుంచి ఒత్తిడి వస్తుందనే ఈ ఇష్యూని ఇలాగే గందరగోళంలో ఉంచమని ప్రగతిభవన్ నుంచి ఆదేశాలు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారమంతా కేవలం కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు చేస్తున్న ప్రయత్నమేననే ప్రచారం జరుగుతున్నది.ఆర్టీసీ అప్పుల్లో ఉందనడం శుద్ధ అబద్ధం. జాతీయ బ్యాంకులు, ఇతర ప్రయివేటు ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాల వాయిదాలన్నీ సక్రమంగానే చెల్లిస్తున్నారు. వారి దగ్గర తీసుకున్న రుణా లకంటే అధికంగా కార్మికుల నుంచి రూ.3 వేల కోట్లకుపైగా అప్పు చేశారు. వీటిని మాత్రమే చెల్లిం చట్లేదు. బుక్ అడ్జస్ట్‌మెంట్లు మాత్రమే చేస్తున్నారు. పీఎఫ్ కమిషనర్ ఇప్పటికే పలుమార్లు యాజ మాన్యానికి నోటీసులు ఇచ్చారు. సీసీఎస్ సొమ్ముపై కోర్టు ధిక్కరణ ఎదుర్కొంటున్నారు. అసలు ఆర్టీసీ నిర్వహణే అసమర్థంగా ఉంది. ప్రభుత్వ గ్యారెంటీ రూ.వెయ్యికోట్ల రుణంపై యాజమాన్యం ఎలాంటి స్పష్టతా ఇవ్వలేదు. ఆ సొమ్మును దేనికోసం ఖర్చు చేస్తారో చెప్పాలి. కార్మికుల సొమ్మును తక్షణం చెల్లించాలి.

## కేక్ కట్‌చేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యేలు

కర్నూలు,జూలై8(: జిల్లా వ్యాప్తంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ సుధాకర్, కర్నూలు మేయర్ బి.వై. రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుకా తదితరులు పాల్గొన్నారు.

# తొట్టంబేడు భూకబ్జాలు పై కన్నెర్ర చేసిన అధికారులు..!

## ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు
## ఎమ్మార్వో పరమేశ్వరరావు.

చిత్తూరు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం కొన్ని రోజులుగా భూకబ్జాలు పరంపర కొనసాగుతోంది. బుధవారం సర్వే నెంబర్ 78 లో అక్రమంగా నిర్మించినటువంటి కట్టడాన్ని పలుమీడియాలో, పత్రికల్లో కథనాలు రావడంతో తొట్టంబేడు తహసీల్దార్ పరమేశ్వరరావు తన సిబ్బంది ఆర్ఐ నాగరాజు, వీఆర్వో చిట్టిబాబు, మాధవి, ధనంజయలతో కలిసి అక్రమ కట్టడం ని జెసిబి పెట్టి తొలగించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ గతంలో ఈ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించినప్పుడు వారికి ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరికలు జారీ చేయడం జరిగింది అయినప్పటికీ వారు మా ఆదేశాలను బేఖాతరు చేయడంతో ఈరోజు ప్రభుత్వ భూమి అని సర్వే నెంబర్ 78 లో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని తొలగించడం జరిగిందని ఎవరు కూడా ప్రభుత్వ భూమిని ఆక్రమించితే ఉపేక్షించేది లేదని వారిపై చట్టరీత్యా కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అదే విధంగా ఇక్కడ హెచ్చరిక బోర్డు కూడా పెట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# ఎక్కడా కనిపించని అమరావతి

విజయవాడ, జూలై 8, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏది? అమరావతి కాదా?.... కేంద్రం ప్రభుత్వం అమరావతిని ఏపీ రాజధానిగా పరిగణించడం లేదా?... ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అందరిలోనూ ఇదే అనుమానం కలుగుతోంది. గత కొద్దిరోజులుగా కేంద్రం నుంచి రాష్ట్రాధికారులకు వస్తున్న లేఖలు, సర్క్యులర్‌లపై ఆంధ్రప్రదేశ్- హైదరాబాద్ అని ఉంటోంది. పాత అలవాటు ప్రకారం అలా పెట్టి ఉంటారని రాష్ట్ర అధికారులు భావిస్తూ వచ్చారు. కానీ, ఇప్పుడు సాక్షాత్తూ కేంద్ర హోంశాఖ చెప్పిన విషయాలు పరిశీలిస్తే ఏపీకి మూడు రాజధానులున్నాయని కేంద్రం సైతం నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది.రాజధాని వ్యవహారంపై ఒకవైపు హైకోర్టులో కేసులు నడుస్తుండగా కేంద్ర ప్రభుత్వమే మూడు రాజధానుల ప్రస్తావన తీసుకురావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏపీ రాజధాని ఏది? ఏపీలో పేదలకోసం ఎన్ని ఇళ్లు కట్టారు? రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలకు ఎంత మంజూరు చేశారు? ఏపీలో స్మార్ట్‌సిటీలకు ఎన్ని నిధులు ఇచ్చారు? ఏపీ ప్రభుత్వం మూడు రాజధానులను కేంద్రం గుర్తించిందా? అంటూ హైదరాబాద్‌కు చెందిన చైతన్యకుమార్‌రెడ్డి అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు కేంద్రం వింతైన జవాబిచ్చింది. ఇదే ప్రశ్న గతంలో అడిగినప్పుడు ఇది ఆర్టీఐ పరిధిలోకి రాదంటూ సమాధానం ఇచ్చిందిఅయితే తానేమీ దేశ రక్షణ రహస్యాలు అడగడం లేదని, రాష్ట్ర రాజధాని ఏదో తెలుసుకోవాలనుకుంటున్నానని తనకు సమాధానం ఇవ్వకపోతే కోర్టుకు వెళతానని చైతన్యకుమార్‌రెడ్డి స్పష్టం చేయడంతో కేంద్ర హోం శాఖ బుధవారం ఆయనకు సమాధానం పంపించింది. అందులో ఒకటి నుంచి ఐదువరకు ఉన్న ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ రాజధాని ఏది మొదలుకొని, మూడు రాజధానులను కేంద్రం గుర్తించిందా అన్న ప్రశ్నలకు కేంద్ర హోంశాఖ సమాధానమిచ్చింది. ఏపీ ప్రభుత్వం వికేంద్రీకరణ- అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి చట్టం తీసుకొచ్చి మూడు రాజధానులను ఏర్పాటు చేసిందని, రాష్ట్ర రాజధాని నగరం ఏదన్నది... ఆ రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందని సమాధానం ఇచ్చింది. ఇక్కడే కేంద్ర వైఖరిపై అనుమానాలు తలెత్తుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏది అంటే ఇప్పుడు ఏది ఉందో అదే చెప్పాలి. మూడు రాజధానులను కేంద్రం అంగీకరించిందా అన్న ప్రశ్నకు వారికి ఇష్టమైన సమాధానం చెప్పవచ్చు. కానీ కేంద్రం ఇచ్చిన సమాధానాల్లో అమరావతి అన్న పదం ఎక్కడా లేదు. అంటే ప్రస్తుత రాజధానిగా అమరావతిని గుర్తించనట్లే కనిపిస్తోంది. అధికారిక లేఖల్లో హైదరాబాద్ అని చూపిస్తున్నారు. ఆర్‌టీఐ కింద అడిగితే అమరావతి మాటెత్తడం లేదు. ఇంతకీ కేంద్రం ఆలోచన ఏంటన్నది అంతుబట్టడం లేదు.

# రఘురామపై ఆధారాలు ఇచ్చిన వైసీపీ

న్యూఢిల్లీ, జూలై 8, (న్యూస్ పల్స్)వైసీపీ రెబల్ ఎంపీ రఘు రామకృష్ణ రాజుకి వైసీపీ భారీ షాకిచ్చింది. జగన్ సర్కార్‌పై వరుస విమర్శలతో కొరకరాని కొయ్యగా తయారైన రఘురామపై అనర్హత వేటు వేయించాలని వైసీపీ పట్టుదలతో ఉంది. అందులో భాగంగానే మరోమారు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో వైసీపీ ఎంపీలు భేటీ అయ్యారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి , లోక్ సభా పక్ష నేత మిథున్ రెడ్డి, పార్టీ చీఫ్ విప్ మార్గాని భరత్ రామ్ లోక్‌సభ స్పీకర్‌ని కలిశారు.ఎంపీ రఘురామ వైసీపీ గుర్తుపై గెలిచి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని.. ఆయనపై తక్షణమే అనర్హత వేటు వేయాలని వైసీపీ ఎంపీలు కోరారు. రఘురామ పార్టీ వ్యతిరేక చర్యలకు సంబంధించిన ఆధారాలను కూడా స్పీకర్‌కి అందజేసినట్లు తెలుస్తోంది. ఆయనపై అనర్హత వేటు విషయంలో ఆలస్యం చేయకూడదని.. త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు విన్నవించారు.ఎట్టిపరిస్థితుల్లో రఘురామను ఎంపీగా కొనసాగనీయకూడదని వైసీపీ పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పదవులు కూడా ఉండవని తీవ్ర హెచ్చరికలు పంపేందుకు వైసీపీ సిద్ధమైంది. ఇటీవల సీఎం జగన్ ఢిల్లీ టూర్‌లోనూ రఘురామ వ్యవహారం చర్చించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. మరోమారు వైసీపీ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ని కలవడంతో రఘురామపై అనర్హత వేటు పడుబోతోందా? అనే ఉత్కంఠ నెలకొంది.

# కమలానికి ఓటు బ్యాంకు రాజకీయాలు

విజయవాడ, జూలై 8, (న్యూస్ పల్స్)బీజేపీ నేతృత్వరంలోని ఎన్డీయే సర్కార్ మంత్రివర్గ విస్తరణపై అదిరిపెయే సెటైర్లు వేశారు టీడీపీ సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి. కేంద్ర క్యాబినెట్‌లో ఏపీకి కనీసం చోటు దక్కకపోవడంపై ఆయన సునిశిత విమర్శలు చేశారు. బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు. తెలుగు ప్రజలకి న్యాయం చేయాలనే తపన ఏ మాత్రం లేకపోవడం శోచనీయమని ఆయన అన్నారు.ఆంధ్ర రాష్ట్రాన్ని కేంద్రం చిన్నచూపు చూసిందని.. కేవలం సీట్లు, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప తెలుగు ప్రజలకి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాలకు లేకపోవడం శోచనీయమని బుచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్ కూర్పుతో ఆంధ్రాలో ఇప్పట్లో ఎన్నికలు లేవని అర్థమైందన్నారు. మధ్యంతర ఎన్నికలు వస్తే మినహా బీజేపీ మనవైపు చూడదన్నమాట.! అంటూ సెటైర్లు విసిరారు. ఓహో అదిరిందయ్యా పుష్పములు అంటూ కమలం పార్టీని ఎద్దేవా చేశారు.

# గోస్పాడు మండలం లో 3 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన యమ్ యల్ ఏ

నంద్యాల జూలై 8, ( విభారె) మీరు చూపిన బాటలో.. మీ అడుగు జాడల్లోమీ ఆశయ సాధన కోసం..మా ప్రయాణందివంగత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకుంటూ నంద్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి. ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలో దీభగుంట్ల గ్రామంలో రైతు దినోత్సవం అలాగే డాక్టర్ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా గ్రామంలో కోటి ఇరవై లక్షల రూపాయలతో వైయస్సార్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు భూమి పూజ నిర్వహించారు. అలాగే రైతు భరోసా కేంద్రాన్ని 22 లక్షల రూపాయలతో నేడు ప్రారంభించడం జరిగింది. అలాగే 25 పొదుపు గ్రూపులకు 1కోటి 11 లక్షల రూపాయల ను మహిళలకు అందజేయడం జరిగిందన్నారు. మండలంలోని డప్పు కళాకారులకు 55 మందికి డప్పు గజ్జెలు పంచె అందించారు . కానాల పల్లె గ్రామంలోని అభ్యుదయ రైతులకు అగ్రికల్చర్ ఆధ్వర్యంలో పవర్ స్ప్రేర్ లను అందజేశామన్నారు. అలాగే నెహ్రూ నగర్ లో రైతు భరోసా కేంద్రం వైయస్సార్ హెల్త్ సెంటర్ ను 40 లక్షల రూపాయలతో నిర్మించి ప్రారంభించడం జరిగిందన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని వైఎస్ హయాంలో రైతులకు అండగా ఉండి రైతు పండగ చేసుకునే విధంగా అభివృద్ధి చేశారని తెలిపారు. అదే బాటలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల కోసం అహర్నిశలు కష్టపడుతూ వారి అభివృద్ధి ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు.

# రాయలసీమ కష్టాలు అర్థం చేసుకోండి

అనంతపురం, జూలై 8, (( విభారె) )దశాబ్దాల తరబడి ఆంధ్ర రాష్ట్రం కలిసి ఉంది. రాయలసీమ, కోస్తాంధ్ర, తెలంగాణ... ఈ మూడూ కలిసిందే ఆంధ్ర రాష్ట్రం. కృష్ణా నదీ జలాలు కోస్తాంధ్రకు ఎంత, తెలంగాణకు ఎంత, రాయలసీమకు ఎంత అనే విభజన ప్రకారమే మొదటి నుంచి కేటాయింపులు జరుగుతూ వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయాక 2015 జూన్ 19వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కేంద్రం కూడా ఈ నీటి కేటాయింపులపై సంతకాలు చేసింది. ఏపీ, తెలంగాణ, కేంద్రం... ఈ మూడూ సంతకాలు చేసిన ప్రకారం... రాయలసీమకు 144 టీఎంసీలు, కోస్తాకు 367టీఎంసీలు, తెలంగాణకు 298 టీఎంసీలు.ఇప్పుడు నేను చేసే విజ్ఞప్తి ఒక్కటే. అందరూ రాయలసీమ పరిస్థితిని గమనించండి. పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు కిందికి రావాలంటే నీటిమట్టం 881 అడుగులు చేరాలి. లేకపోతే పూర్తిస్థాయిలో నీళ్లు రావు. శ్రీశైలం డ్యామ్ పూర్తి సామర్థ్యం ఎంతంటే 885 అడుగులు. నేను సీఎం అయ్యాక ఈ రెండేళ్లు వర్షాలు బాగా పడ్డాయి. ఆ రెండేళ్లను వదిలేస్తే, అంతకుముందు 20 ఏళ్లుగా శ్రీశైలం డ్యామ్ లో 881 అడుగుల పైచిలుకు నీటిమట్టం ఎన్నిరోజులు ఉందన్న విషయం పరిశీలిస్తే, 20-25 రోజులు ఉందని గట్టిగా చెప్పలేని పరిస్థితి ఉంది.ఇలాంటి పరిస్థితుల్లో పోతిరెడ్డిపాడు నుంచి పూర్తి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేయాలంటే ఏంచేయాలి? మరోవైపు తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి సామర్థ్యం పెంచి వాడుకుంటున్నారు. వాటన్నింటి నుంచి 800 అడుగుల లోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. 796 అడుగుల్లోపే తెలంగాణకు విద్యుదుత్పాదన చేసే సౌకర్యం ఉంది.ఇలాంటప్పుడు 800 అడుగుల లోపే మీకు కేటాయించిన నీరు వాడుకున్నప్పుడు తప్పులేనప్పుడు, మరి మేము 881 అడుగులకు నీటిమట్టం చేరుకుంటే తప్ప వాడుకోలేని పరిస్థితులు ఉన్నాయి. అలాంటప్పుడు మేం రాయలసీమ ప్రాజెక్టుకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తే తప్పేంటి అని అడుగుతున్నా. మాకు హక్కుగా కేటాయించిన నీటినే మేం వాడుకుంటుంటే మీకు అభ్యంతరం ఏంటి అని ప్రతి పాలకుడిని అడుగుతున్నా.చంద్రబాబుకు ఇంకాస్త ఘాటుగా చెప్పదలుచుకున్నా.

గతంలో నువ్వు సీఎంగా ఉన్నప్పుడు, అవతల తెలంగాణకు సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాలమూరు-రంగారెడ్డి, డిండి వంటి ఎత్తిపోతల ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతుంటే నువ్వేం గాడిదలు కాస్తున్నావు చంద్రబాబూ? అని అడుగుతున్నా.మా ప్రాజెక్టుల సామర్థ్యం పెంచుకుంటోంది ఎవరి వాటా నీళ్లు తీసుకోవడానికి కాదు. రైతులకు ఉపయోగపడే నీళ్ల విషయంలో రాజకీయాలు జరగడం బాధాకరం. అయితే మేం ఏ ఒక్క పొరుగు రాష్ట్రంతోనూ విభేదాలు కోరుకోవడం లేదు. మేం పాలకుల మధ్య సత్సంబంధాలు ఉండాలనే కోరుకుంటున్నాం. ఈ జగన్ ఎప్పుడూ అలాగే కోరుకుంటాడు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి పక్క రాష్ట్రాల రాజకీయాల్లో ఎప్పుడూ వేలు పెట్టబోను. రాబోయే రోజుల్లోనూ నా వైఖరి ఇలాగే ఉంటుంది. అందరితోనూ మంచినే కోరుకుంటున్నా" అని సీఎం జగన్ ఉద్ఘాటించారు

# నూతన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించిన నంద్యాల ఎమ్మెల్యే



శిల్పా నంద్యాల :: (విభారె న్యూస్):: నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న పశు వైద్యశాల నందు నూతనంగా 86 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన మరో పశు వైద్యశాల భవనాన్ని నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లో మున్సిపల్ చైర్మన్ మబ్బున్నిసా మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈషాక్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగి శెట్టి శ్రీధర్ 39 వ వార్డు కౌన్సిలర్ వెంకటలక్ష్మి 39 వ వార్డు ఇన్చార్జి లక్ష్మీనారాయణ పశు వైద్యశాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# ఆళ్లగడ్డలో ఘనంగా వైఎస్ఆర్ జన్మదిన వేడుకలు

ఆళ్లగడ్డ :: ( విభారె న్యూస్):: రైతు బాంధవుడు వైయస్సార్ 72 వ జయంతి ఆళ్లగడ్డ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి శాసనసభ్యులు గంగుల



బిజేంద్రారెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ జయంతిని వైఎస్సార్ రైతు దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని కొనియాడారు. అనంతరం పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో 65 లక్షల రూపాయలతోనూతనంగా నిర్మించబడిన వైయస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ ను రైతు బజార్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గంగుల మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి, గంగుల రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, డిడి నరసింహారావు, ఏ డి ఏ రామ్మోహన్ రెడ్డి, రిటైర్డ్ ఎ డివి వరప్రసాద్, పశు సంవర్ధక శాఖ డాక్టర్లు వరప్రసాద్, తాసిల్దార్ రమేష్ రెడ్డి ఎంపీడీవో అక్రం భాష ,ఏవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు గోట్లూరు సుధాకర్ రెడ్డి, సింగం వెంకటేశ్వర్ రెడ్డి,సింగం భరత్ రెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ రవి, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయప్రకాశ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయాబ్ రసూల్, గజ్జల రాఘవేంద్ర రెడ్డి, సింగం భరత్ రెడ్డి, వైయస్సార్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైద్యం అందక ఎవరి ప్రాణం పోకూడదు :: నంద్యాల శాసనసభ్యులు శిల్పా

గోస్పాడు :: ( విభారె) :: గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామం నందు 30 పడకల ఆసుపత్రిగా ఆధునీకరణ పనులకు ఎమ్మెల్యే శిల్పా భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. వైస్సార్ ప్రభుత్వం యిచ్చిన ప్రతి మాటను నెరవేర్చుతుందని గ్రామాలను అభివృద్ధి చేసేవిధంగా ముఖ్యమంత్రి జగనన్న ముందుకు తీసుకోపోతున్నారన్నారు ఆలూరు గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఇవ్వడం జరిగిందని, అలాగే అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చుని ఎమ్మెల్యే శిల్పా అన్నారు. అనంతరం శిలాఫకాలన్నీ ఆవిష్కరించారు.

## సీఎంకు రైతుల కష్టాలు పట్టవా?: దేవినేని ఉమ

విజయవాడ: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రైతుల కష్టాలు పట్టవా? అంటూ టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రైతు బాధలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదని, నారుమళ్లకు నీళ్లు ఇచ్చే సమయంలో సముద్రంలోకి నీళ్లు వదులుతున్నారని మండిపడ్డారు. 'ప్రగతి భవన్‌లో జగన్‌రెడ్డి బిర్యానీ తినేటప్పుడు గుర్తుకు రాలేదా?.. నాడు భేషజాలు లేవన్నారు...ఇవాళ మీ భేషజాలు ఏమయ్యాయనివ నిలదీశారు. బూతుల మంత్రి కొడాలి నాని ఏం చేస్తున్నారన్నారు. వ్యవసాయ మంత్రి నోరు విప్పడంలేదన్నారు. చంద్రబాబు, లోకేష్‌లను తిట్టడం తప్ప మంత్రులకు ఏమీ తెలియదని దేవినేని విమర్శించారు.రైతులకు ధాన్యం బకాయిలను తక్షణమే చెల్లించాలని దేవినేని ఉమ డిమాండ్ చేశారు

# వైష్ణవ్ లా మరెవ్వరు సాహసం చేసేందుకు సిద్దంగా లేరా?



టాలీవుడ్ లో ఈ ఏడాది విడుదల అయ్యి ఘన విజయం సాధించిన సినిమాలు ఏవీ అంటే ఠక్కున గుర్తుకు వచ్చే సినిమా ఉప్పెన. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఏకైక వంద కోట్ల సినిమా ఉప్పెన అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఉప్పెన సినిమా బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ సక్సెస్ ను దక్కించుకుంది. వైష్ణవ్ తేజ్ మరియు కృతి శెట్టిల లవ్ కమ్ రొమాన్స్ మరియు విజయ్ సేతుపతి విలనిజం దర్శకుడు బుచ్చి బాబు మేకింగ్ అండ్ టేకింగ్ అన్ని కలగలిపి ఉప్పెన సినిమా ను బిగ్గెస్ట్ సక్సెస్ గా మార్చాయి. ఈ సినిమా ను తమిళంలో ఒక యంగ్ హీరోతో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అంటూ ఆ మధ్య వార్తలు వచ్చాయి.రీమేక్ మరియు డబ్బింగ్ రైట్స్ ను ప్రముఖ నిర్మాన సంస్థ కొనుగోలు చేసినట్లుగా తెలుస్తోంది. గత కొన్ని నెలలుగా ఈ సినిమాను రీమేక్ చేసేందుకు వారు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. కాని ఈ సినిమా లో హీరో పాత్ర ను చేసేందుకు ఏ యంగ్ తమిళ హీరో కూడా ముందుకు రావడం లేదట. ఈ సినిమా లో హీరో క్లైమాక్స్ ట్విస్ట్ అందరికి తెల్సిందే. అందుకే తమిళ హీరోలు ఈ సాహసంను చేసేందుకు ముందుకు రావడం లేదని అంటున్నారు.తమిళంలో ఇలాంటి పాత్రలు.. క్లైమాక్స్ లో చంపేయడాలు ఉంటాయి. కాని ఉప్పెన సినిమాలో హీరోకు చేసినట్లుగా కట్టింగ్ లు మాత్రం ఉండవు. కనుక ఇలాంటి ప్రయోగాన్ని చేస్తే అరవ ప్రేక్షకులు ఒప్పుకుంటారో లేదో అనే అనుమానంతో తమిళ హీరోలు ఎవరు కూడా ఈ రీమేక్ కు ఆసక్తి చూపడం లేదట. ముందు ముందు అయిన ఈ సినిమా రీమేక్ కు ఎవరైనా ఒప్పుకుంటారా అంటే అనుమానమే అన్నట్లుగా రీమేకర్ రైట్స్ తీసుకున్న మేకర్స్ ఒక అంచనాకు వచ్చారు. అందుకే ఈ సినిమా ను రీమేక్ కాకుండా డబ్బింగ్ చేసి విడుదల చేయాలని భావిస్తున్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో థియేటర్ రిలీజ్ అసాధ్యం. కనుక ఉప్పెన సినిమా ను డబ్బింగ్ చేసి ప్రముఖ ఓటీటీకి అమ్మేయాలనే యోచనలో రైట్స్ దక్కించుకున్న నిర్మాతలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఖచ్చితంగా ఈ సినిమా తమిళ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హీరోలు ఎవరైనా సాహసం చేసి ఈ సినిమాను రీమేక్ చేస్తే తప్పకుండా కెరీర్ బెస్ట్ మూవీగా నిలుస్తుంది. కాని ఎవరు కూడా వైష్ణవ్ తేజ్ మాదిరిగా సాహసం చేసేందుకు ముందుకు రావడం లేదు. మొదటి సినిమాకే ఇలాంటి సాహసం చేసేందుకు వైష్ణవ్ ముందుకు రావడం అంటే నిజంగా చాలా పెద్ద విషయం.మెగా ఫ్యామిలీ అంతా కూడా అందుకు ఒప్పుకున్నారు అంటే బుచ్చి బాబు చెప్పిన కథను వారు ఎంతగా నమ్మారో అర్థం చేసుకోవచ్చు. కాని తమిళ హీరోలు ఎవరు కూడా ఈ సాహస పాత్రకు సిద్దంగా లేరు. కథపై నమ్మకం ఉన్నా కూడా వారు మాత్రం వెనుకడుగు వేస్తున్నారు. ఒక వేళ డబ్బింగ్ అయ్యి విడుదల అయిన తర్వాత ఏ హీరో అయినా మనసు మార్చుకుంటాడేమో చూడాలి. ఉప్పెన అరవ వర్షన్ గురించి ఒకటి రెండు వారాల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# మనోహరి హ్యాండ్ బ్యాగ్ ఖరీదు 4 లక్షలు

బాలీవుడ్ హాట్ గాళ్స్ లో ఖరీదైన బ్రాండెడ్ హ్యాండ్ బ్యాగుల్ని ధరించే అలవాటు గురించి ప్రత్యేకించి ప్రస్థావించనవసరం లేదు. సోనమ్ కపూర్ - జాన్వీ కపూర్ - కరీనా - కత్రిన - మలైకా సహా పలువురు అందాల భామలు బ్రాండెడ్ హ్యాండ్ బ్యాగుల కోసం లక్షలాది రూపాయలను వెచ్చించడం చూస్తున్నదే. 2లక్షల నుంచి 30 లక్షల వరకూ కేవలం హ్యాండ్ బ్యాగ్ కోసమే వెచ్చించే ఫ్యాషనిస్టాలు పరిశ్రమలో ఉన్నారు.ఇక బాహుబలి మనోహరి నోరా



ఫతేహి ఇలాంటి విషయాల్లో అస్సలు తగ్గదు. ఇండస్ట్రీలో ఫ్యాషనిస్టాగా ఓ వెలుగు వెలుగుతున్న నోరా తన రేంజుకు తగ్గ హ్యాండ్ బ్యాగుల్ని ధరిస్తుంటుంది. తాజాగా నోరా ఫతేహి నియాన్ పసుపు బాడీకాన్ దుస్తులు ధరించి చేతిలో 3 లక్షల ఖరీదైన హ్యాండ్ బ్యాగ్ తో ప్రత్యక్షమైంది. బాడీకాన్ మిడి దుస్తులలో నోరా ఫతేహి లుక్ అదిరిపోయింది.క్షమించండి హనీ.. నా లేన్ లో ఎవరూ లేరు! అనే శీర్షికతో ఈ పోస్ట్ ను నోరా పంచుకున్నారు. ఈ ఫోటోను హసన్ హజ్జ్ క్లిక్ మనిపించారు.నోరా ఫిగర్-హగ్గింగ్ సిల్హౌట్ ఒంపుసొంపుల్ని అందంగా చూపించింది. చదునైన నెక్ లైన్ రిబ్బెడ్ ఆకృతి సమ్మర్ పార్టీ రూపాన్ని పరిపూర్ణంగా చేసింది. చానెల్ మినీ ఫ్లాప్ బ్యాగ్ విలువ రూ. 363152 .నోరా ప్రస్తుతం వార్ డ్రామా 'భుజ్: ది ప్రైడ్ ఆఫ్ ఇండియా'లో నటిస్తోంది. ఇందులో అజయ్ దేవ్ గన్.. సంజయ్ దత్ .. సోనాక్షి సిన్హా తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రం డిస్నీ + హాట్ స్టార్ లో డైరెక్ట్-టు-డిజిటల్ విడుదలకు సిద్ధంగా ఉంది.




# సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ ను ఓటీటీ-ఏటీటీలు రీ ప్లేస్ చేయలేవు'

'ఈ రోజుల్లో' సినిమాతో నిర్మాతగా ఇండస్ట్రీకి పరిచయమైన ఎస్కేఎన్.. 'టాక్సీవాలా' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నాడు. ఈ క్రమంలో గీతా ఆర్ట్స్ - యూవీ క్రియేషన్స్ వారితో కలిసి 'భలే భలే మగాడివోయ్' 'మహానుభావుడు' 'ప్రతిరోజూ పండగే' వంటి సినిమాలకు కో ప్రొడ్యూసర్ గా వ్యవహరించాడు. ప్రస్తుతం 'పక్కా కమర్షియల్' చిత్రానికి సహ నిర్మాతగా ఉన్నాడు. అల్లు అర్జున్ - రామ్ చరణ్ - రవితేజ వంటి స్టార్ హీరోలకు పీఆర్వోగా పని చేసిన ఎస్కేఎన్.. నేడు (జూలై 7) పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎస్కేఎన్ మీడియాతో మాట్లాడుతూ ఫ్యూచర్ ప్రాజెక్ట్ లు.. తన కెరీర్ గురించి పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఆ విశేషాలు..? ప్రస్తుతం మారుతి అండ్ టీమ్ డైరెక్ట్ చేస్తున్న ఓ సినిమాను యూవీ క్రియేషన్స్ తో కలిసి నిర్మిస్తున్నా. దర్శక నిర్మాత సాయి రాజేష్ తో కలిసి మూడు సినిమాలు చేయనున్నాను. 'కలర్ ఫోటో' దర్శకుడు సందీప్ రాజ్ తో రెండు సినిమాలు ఉన్నాయి. ఆషాడ మాసం వెళ్లిపోయిన తర్వాత వీటి వివరాలు తెలియజేస్తాం. 'టాక్సీవాలా' డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ - వీఐ ఆనంద్ - 'పలాస ఫేమ్ కరుణ్ కుమార్ లతో కూడా సినిమాలు ఉన్నాయి. ఆహా ఓటీటీ కోసం 'త్రీ రోజెస్'.. జీ5 ఓటీటీ కోసం ఓ వెబ్ సిరీస్ చర్చలు తుదిదశలో ఉన్నాయి. ప్రస్తుతం మూడు సినిమాలు మూడు వెబ్ సిరీస్ లు సెట్స్ పై ఉన్నాయి. ఇక కొత్త ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మారుతి గారు నేను కలిసి మాస్ మూవీ మేకర్స్ అనే బ్యానర్ ను స్టార్ట్ చేసి వెబ్ కంటెంట్ ను వ్యూయర్స్ ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం.? సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ ను ఓటీటీ ఏటీటీలు రీ ప్లేస్ చేయలేవు. కొన్ని సినిమాలను తెరపైనే చూడాలి. కానీ కరోనా వల్ల కొంతమంది నిర్మాతలు ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో వారు ఓటీటీలకు వెల్లడంలో తప్పులేదేమో. కానీ థియేటర్స్ వ్యవస్థ లేకపోతే స్టార్డమ్ తగ్గిపోయింది. థియేటర్స్ వ్యవస్థ మనుగడ బాగుండాలి. అది థియేటర్స్ కు మాత్రమే కాదు..ఇండస్ట్రీకి కూడా మేలు. కొంతమంది నిర్మాతలు ఈ పరిస్థితుల్లో ఓటీటీలకు వెళుతున్నారు. దాన్ని తప్పుపట్టలేం. కానీ ఒక వ్యక్తిగా ప్రేక్షకుడిగా నిర్మాతగా నేను థియేటర్స్ బిగ్ స్క్రీన్ పై సినిమా చూసేందుకే మొగ్గుచూపుతాను. ఒకసారి థియేటర్స్ లో సినిమా ప్రదర్శితమైన తర్వాత ఓటీటీకి వస్తేనే బెటర్ అని నా అభిప్రాయం.? లాక్ డౌన్ తర్వాత థియేటర్స్ రీ ఓపెన్ చేస్తే తెలుగు ప్రేక్షకులు మునపటిలానే వచ్చారు. స్టార్ హీరో సినిమాలు విడుదలైనప్పటికీ ఏ ఇండస్ట్రీలోనూ ఇలా జరగలేదు. తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. కరోనా సెకండ్ వేవ్ వస్తున్న సమయంలో పవన్ కల్యాణ్ గారి 'వకీల్ సాబ్' వస్తే ఎంతటి ఓపెనింగ్ వచ్చాయో మనందరికీ తెలుసు. అలాగే 'క్రాక్' 'జాతిరత్నాలు' ఫస్ట్ వేవ్ తర్వాత విడుదలైన తొలి సినిమా 'సోలో బ్రతుకే సో బెటర్' సినిమాలను ప్రేక్షకులు ఎంతగా ఆదరించారో. చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా ప్రేక్షకులు మంచి సినిమాలను ఆదరించారు. సినిమా మన దైనందిన జీవితంలో ఓ భాగం. మనం ఆఫీకు వెళ్తున్నాం. హోటల్ కు వెళ్తున్నాం. అలాగే సినిమాలకు వెళతాం. కోవిడ్ వ్యాక్సినేషన్ వల్ల ప్రేక్షకుల్లో కూడా కాస్త భయం తగ్గింది. థర్డ్ వేవ్ లేకపోతే థియేటర్స్ రీ ఓపెన్ అయితే ప్రేక్షకులు థియేటర్స్ కు వస్తారనే అనుకుంటున్నాం.

# పవన్ కు జోడీగా మలయాళ ముద్దుగుమ్మనే ఫిక్స్ చేశారా..?

పవన్ కళ్యాణ్ - రానా దగ్గుబాటి హీరోలుగా మలయాళ బ్లాక్ బస్టర్ 'అయ్యప్పనుమ్ కొశీయుమ్' చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేస్తున్న విషయం తెలిసిందే. 'అప్పట్లో ఒకడుండేవాడు' ఫేమ్ సాగర్ కె.చంద్ర ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే - డైలాగ్స్ అందించడంతో పాటుగా దర్శకత్వ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి ఇందులో హీరోయిన్లుగా ఎవరు నటిస్తారనేది ఆసక్తికరంగా మారింది.మలయాళ వెర్షన్ లో



హీరోయిన్ల పాత్రకు పెద్దగా ప్రాధాన్యత ఉండదు. కానీ తెలుగు స్క్రిప్ట్ లో నేటివిటీకి తగ్గట్లు మార్పులు చేయడమే కాకుండా.. ఫీమేల్ లీడ్ క్యారక్టర్స్ కు కూడా ఇంపార్టెన్స్ ఉండేలా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు 'ఏకే' రీమేక్ లో నటించే హీరోయిన్లు అంటూ అనేకమంది ముద్దుగుమ్మల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ క్రమంలో రానా భార్యగా ఐశ్వర్య రాజేష్ ను ఫైనలైజ్ చేసినట్లు మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. కానీ పవన్ భార్యగా ఎవరు నటిస్తున్నారనే విషయంలో సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది.ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా వస్తున్న వార్తలను నిజం చేస్తూ మలయాళ బ్యూటీ నిత్యామీనన్ ను పవన్ కు జోడీగా ఫిక్స్ చేశారని తెలుస్తోంది. ఎలాంటి పాత్ర అయినా సహజంగా నటించే నిత్య.. తన పాత్ర ప్రాధాన్యతను బట్టే సినిమా చేయడానికి అంగీకరిస్తుంది. ఇప్పుడు 'అయ్యప్పనుమ్ కొశీయుమ్' తెలుగు రీమేక్ లో పవన్ కు ఫ్లాష్ బ్యాక్ పెట్టడంతో పాటుగా నిత్య పాత్ర నిడివి కూడా పెంచినట్లు టాక్. ఈ నేపథ్యంలోనే నిత్య ఈ సినిమా చేయడానికి ఒప్పుకుందని అంటున్నారు. అంతేకాదు వచ్చే వారంలో ప్రారంభమయ్యే షూటింగ్ లో అడుగుపెట్టపోతుందని సమాచారం షూటింగ్ ఇప్పటికే 40 శాతానికి పైగా పూర్తయ్యింది. కరోనా సెకండ్ వేవ్ పరిస్థితుల్లో నిలిచిపోయిన ఈ సినిమా షూటింగ్ ను జూలై 12న తిరిగి ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. దీని కోసం హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో పోలీస్ స్టేషన్ సెట్ కూడా వేసినట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్ లో ఏకధాటిగా చిత్రీకరణ జరిపి ఆగస్ట్ నెలాఖరుకు మొత్తం సినిమాని కంప్లీట్ చేయాలని చిత్ర యూనిట్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోందట.ఇకపోతే మలయాళంలో బీజూ మీనన్ పోషించిన నిజాయితీ గల పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవన్ నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన రిటైర్ట్ హవల్దార్ క్యారక్టర్ లో రానా కనిపించనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. ప్రసాద్ మూరెళ్ళ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**